
# గాలిబు

ఎం. ముజీబు



TL
819.150 92
G 341 M

TL
819.15092
G341M



INDIAN INSTITUTE
OF
ADVANCED STUDY
LIBRARY, SHIMLA

# గాలిబు

అట్ట లోపలివైపున అచ్చువేసిన శిల్పచిత్రంలో కనబడేది శుద్ధోదన మహారాజుకు గౌతమ బుద్ధుని తల్లియైన మహారాణి మాయాదేవి కన్న స్వప్నం గురించి జ్యోతిషికులు వ్యాఖ్యచేస్తూ ఉండిన దృశ్యం. వారికి దిగువ వారి వ్యాఖ్యను వ్రాసుకొంటున్న లేఖకుడు కనిపిస్తాడు. భారత దేశంలో లేఖన కళ చిత్ర శిల్పంలో నిబద్ధమై లభించే దృష్టాంతాలలో ఇదే ప్రాచీనతమమైనది.

నాగార్జున కొండ క్రీ.శ. 3వ శతాబ్దం.

(జాతీయ పురావస్తు ప్రదర్శనశాల, న్యూఢిల్లీ, వారి సౌజన్యముతో).

భారతీయ సాహిత్య నిర్మాతలు

# గాలిబు

రచయిత :

ఎం. ముజీబు

అనువాదము :

కే. గోపాలకృష్ణా రావు

సాహిత్య అకాడెమీ

*Ghalib* - Telugu translation by K. Gopala Krishna Rao of
M. Mujeeb's monograph in English.
Sahitya Akademi, 1990. Rs.: SAHITYA AKADEMI
REVISED PRICE Rs. 15.00

TL
819.150 92
G341M

Indian Inst...
117663
20/12/04
SHIMLA

© M. Mujeeb

First Edition - 1978
Reprint - 1990

సాహిత్య అకాడెమీ
ప్రధాన కార్యాలయం:
రవీంద్ర భవన్, 35 ఫిరోజ్‌షా రోడ్, న్యూఢిల్లీ - 110 001.
విక్రయ విభాగం:
'స్వాతి' మందిర్ మార్గ్, న్యూఢిల్లీ - 110 001.

ప్రాంతీయ కార్యాలయాలు:
29, ఎల్డామ్స్ రోడ్, తేనాం పేట, మద్రాస్ - 600 018.
జీవనతార భవనము (నాల్గవ అంతస్తు), 23A/44x, డైమండ్ హార్బర్ రోడ్, కలకత్తా - 700 053.
172, ముంబయ్ మరాఠి గ్రంథ సంగ్రహాలయ మార్గ్, దాదర్, బొంబాయి - 400 014.

రూ. SAHITYA AKADEMI
REVISED PRICE Rs. 15.00

Library IIAS, Shimla
TL 819.150 92 G 341 M
00117663

*Offset Reprint by* Classic Prints, Madras.

# విషయసూచిక


| | | పుట |
|---|---|---|
| గాలిబు - కాలము | .... | 5 |
| గాలిబు - వ్యక్తి | .... | 15 |
| గాలిబు - కవితా సంప్రదాయము | .... | 30 |
| గాలిబు - కవి | .... | 38 |
| అనువాదములు | .... | 49 |
| గ్రంథసూచి | ... | 89 |

మిర్జా అసదుల్లాఖాను గాలిబు క్రీ. శ. 1797 డిసెంబరు మాసాంతములో ఆగ్రాలో జన్మించినాడు. 1796 సెప్టెంబరు మాసములో ఫిరూన్ అను ఫ్రెంచి దేశీయుడు దౌలతురాం సింధ్యా రాజసైన్యానికి ప్రధాన సైనికాధి కారిగా నియమితు డయ్యెను. ఆ పదవితోపాటు అతడు హిందూస్తాన్ దేశము నకు గవర్నరుగా బాధ్యతలు నిర్వహించేవాడు. ఈ సైన్యాధికారి ఢిల్లీపై దండెత్తి దానిని స్వాధీనం చేసికొని తన ఆధీనంలో నుండిన "లేమార్షాను" అను సైనికాధికారిని ఆ నగరమునకు గవర్నరుగాను, షాః ఆలం చక్రవర్తికి సంరక్షకుడుగాను నియమించినాడు. ఆ తర్వాత ఫిరూన్ ఆగ్రా నగరాన్ని వశపఱచుకొని ఉత్తర హిందూదేశముపై సంపూర్ణాధిపత్యము వహించినాడు; పది లక్షలపౌనులకు మించిన రెవిన్యూ వార్షికాదాయము గాగల ప్రాంతము లాతని ఆధీనములో నుండెను. అలీగఢ్ సమీపములో సుందర సౌధమున నివాసమేర్పఱచుకొని రాజవైభవమున రాణించి, అక్కడనుండి రాజకుమారు లకు పరమానా లిచ్చుచు, చంబల్ నుండి సత్లజు వరకు గల మండలముపై నిరాటంకముగ పౌర, సైనిక అధికారము వహించినాడు.

క్రీ. శ. 1803 సెప్టెంబరు 15 నాడు సింధియాకు సర్దారుగానుండిన ఫ్రెంచి అధికారి బోర్గియాన్‌ను ఓడించి, విజేతగా ఢిల్లీలో ప్రవేశించి, అది బ్రిటిషువారికి దత్తము కాకముందే కొల్లగొట్టినాడు. జనరల్ లేక్ చక్రవర్తి దర్శనము నొంది అనేక గౌరవ బిరుదములచే సత్కరింపబడినాడు. షాః ఆలమ్, అతని వారసు లందరు అసమర్థులై ఈస్టిండియా వారి భరణముపై జీవించసాగినారు.

భారతదేశమున పదునెన్మిదవ శతాబ్ది కాలము పాశ్చాత్యదేశ సాహ సికుల యుగము అని భావింపవచ్చు - మధ్య పశ్చిమ ఆసియా ప్రాంతముల నుండి బ్రతుకు తెరువు కొరకు తమ భాగ్యము పండించుకొనుటకు కొందఱు వచ్చినారు. వారిలో మీర్జాఖౌఖాన్‌బేగ్ ఒకడు. ఈతడు మహమూదు షా పరి పాలనా కాలము చివరి దశలో సమర్ఖండ్ నుంచి భారతదేశము వచ్చి

లాహోరులో మొయిన్-ఉల్-ముల్క్ కొలువులో ప్రవేశించినారు. ఇంతకు మించి ఈతని గూర్చి వివరము లేవియు తెలియవు. మిర్జా అబ్దుల్లాబేగ్, నసరుల్లాబేగు అనువారు ఈతని పుత్రులు. అబ్దుల్లాబేగు పుత్రుడే గాలిబు. అబ్దుల్లా బేగ్ సైనికుడుగా రాణించి కీర్తి సంపాదించుకొనలేదు. మొదట లక్నోలో ఆసిఫుద్దౌలా సైన్యంలో చేరినాడు. తదనంతరము కొన్నినాళ్ళు హైదరాబాదు నవాబును, మరికొంత కాలము అల్వర్ రాజా బఖ్తావర్ సింగును ఆశ్రయించి జీవించినాడు. చాల కాలమువరకు ఈతడు ఇల్లరికపు టల్లుడుగ కాలము గడిపినాడని చెప్పవచ్చు. అల్వర్ మండలము నందలి రాజగఢ్ ప్రాంతములో క్రి. శ. 1802 లో ఈతడు మరణించినాడు. అప్పటికి గాలిబు అయిదేండ్ల బాలుడు. ఈతని ఆత్మబంధువులు లోహారు నవాబులు కూడ తన తాతగారి కాలమున వలసవచ్చినవారి వంశీయులే.

అనిశ్చిత, అరాచక, హింసాత్మక పరిస్థితులు, అంతయు కొందఱు సాహసికులపై ఆధారపడినదని భావించు పరిస్థితి, సమాజముపై ముద్రవేసి శాశ్వతమైన నిరాశాపూరితమైన వాతావరణమును కలిగించును. సుకుమార హృదయులు అన్ని పరిస్థితులలోను ఉత్సాహం కంటె మానసిక వ్యధనే అనుభవింతురు. మొగలు సామ్రాజ్య విచ్ఛిత్తి స్థానిక, గ్రామీణ సర్దారుల విజృంభణము, అధికార ప్రాబల్యమునకు వారి ప్రాకులాట మున్నగునవి గాలిబు కవితా జీవితమునకు పూర్వరంగములు. అయినను వాని ప్రభావ మాతనిపై అంతగా ప్రసరింపలేదనియే భావింపవచ్చు. భారతదేశమున రాజకీయ రంగమునకు విస్తృత పరిధిలో ప్రాధాన్య మెన్నడు కలుగలేదు. విధేయత ప్రశంసాత్మక గుణముగ పరిగణింపబడెను. కాని రాజ్యమునకు విశ్వాసపాత్రులుగ నుండుట నైతిక ధర్మముగ గణనకెక్కలేదు. ప్రజాసంక్షేమము కోరిన ప్రభువులు శాంతి భద్రతలు కాపాడుటకు శక్త్యనుసారము ప్రయత్నించిరి. కాని దేశమునందలి మారుమూల ప్రాంతములలో అవకాశము లభించినపుడు కొందరు దారిదోపిడులను పూనుకొనువారు. ఉత్తర హిందూదేశము నందలి నగర సంస్కృతిని, దానిని ప్రతిబింబించే సాహిత్యమును, పరిశీలించినపుడు దానిపై సమకాలిక వాతావరణ ప్రభావము కంటెను, బ్రిటిషువారి ఆధిపత్యమునకు పూర్వపు అరాచక పరిస్థితుల కంటెను, తరతరాలనుండి రూపొందిన జీవన విధానము, ఆ సంస్కృతి

వలన ప్రభావితులైనవారు సాహిత్య అభిరుచులకు గలిగించిన ప్రత్యేక లక్షణ ములు, తత్ఫలితముగ రూపొంది ఆలోచనా విధానముయొక్క ప్రభావమే అధికమని స్పష్టమగును.

ఈనగర సంస్కృతి సంకుచిత దృక్పథాత్మకమై నగరమునకుమాత్రమే పరిమితమైయుండెను.అది నగరాన్ని ఎడారిలోని ఎండమావిగ భాసింపజేసినది. నగరపు గోడలు ఆవరించియున్న అనాగరక జీవనము,సంస్కృతిని కాపాడు రక్షకకుడ్యములుగ రూపొందినవి. నగరమునందే విలాసజీవనమునకు సంపూర్ణ అవకాశములు కలవనియు, నగర ప్రాశస్త్యము, వైభవము ననుస రించి జీవన విధానముకూడా మహోన్నతమై భాసిల్లునని వారు భావించిరి. ఏదియో ఒక విధమైన ఉన్మత్తదశలో, ఆవేశములో మానవుడు నగర పరి ధిని దాటి ఒక్కొక్కసారి సుదూరముగ వెళ్లెడివాడు. ప్రకృతి నగరము లోనే సాక్షాత్కరించుచున్నదనియు, అది గ్రామీణ ప్రాంతములలో నామ మాత్రముగ నైనను కనిపించదని వారి విశ్వాసము.

బారులు తీరిన తమాల వృక్షాల మధ్య ప్రేయసి విలాసముగ, ఒయ్యా రముగ తిరిగే మార్గాలు, రంగు రంగుల పూలతో నవనవలాడే ఉద్యాన వనాలు, పూలరెమ్మలపై ముత్యాలవలె మిసమిసలాడే హిమ బిందువులు, గుసగుసలాడే కమ్మ తెమ్మెరలు, గులాబీలకై, గొంతు సవరించి కూని రాగాలుతీసే బుల్బులిపిట్టలు, మైమరచి స్వేచ్ఛగా తిరిగే పక్షుల నీర్ష్యతో చూచెడి పంజరములోని పక్షులు, ప్రశాంత వాతావరణమును భంగమొనర్చి మిన్ను విరిగి మీదపడే సంఘటనలు - మొదలగునవి నగరమున కవితా రంగము నందలి రమణీయ దృశ్యములు. అయినను కవితా కల్పన మొక్కొక్కసారి, నగరానికి సుదూర ప్రాంత వాతావరణమునుండి కూడ కవి సమయముల నపేక్షించెడిది. వీనిలో - సుదూర, అనిశ్చిత గమ్యమునకు పయనించే బిడారులు, తుపానుల ఢీకొను సంఘర్షణలు, ఎడారులు – అడ వులు – బంజరు భూములు మొదలగునవి ఇట్టివి. కాని నగర ప్రాంతమే విస్తృత కవితాసామగ్రిని, కల్పనలను ప్రసాదించుటకు విశాల రంగముగ తోడ్పడేది. ఇచట మదిర–మద్యము నొసగే మదిరాక్షి – పానశాల–ముఖము చిట్లించుకొనుచు కపట ధర్మోపదేశాలు చేసే 'ముల్లా' – ప్రేయసి మందిర

ద్వారమునకు దారితీయు నగరవీధులు - ద్వారపాలకుడు - తలదాచుకొని కూర్చొనుటకు, తలబ్రద్దలుగా నొనర్చుకొనుటకు ఉపయోగపడే ఇంటిగోడలు- కాకతాళీయముగ లేక ఉద్దేశపూర్వకముగ దర్శనభాగ్య మొసగి విలాసముగా విహరించే ప్రేయసి సౌధోపరితలము; ప్రేయసిచే తిరస్కృతుడైన ప్రియులకు, ప్రేయసి కర్కశహృదయమును వ్యక్తీకరించుటకు ఉరికంబ మెక్కుటకు సిద్ధమై ప్రియులు తిరిగే నడివీధులు - ప్రణయ సమావేశములు - క్రొవ్వొత్తుల వెలుగున కాకర్షింపబడి వచ్చి దీపశిఖలపై అసువులు వీడే పురుగులు-సంకేత స్థలాలు మొదలగునవి ఇట్టివి.

నగరమున కిట్టి ప్రశస్తిని కవియే కల్పించినా డనుట సమంజసము కాదు. అతి ప్రాచీనకాలమునుండి భారతదేశము - నగరము, పల్లె అను భేదాలను పాటించినదో అన్నట్లు - అవి రెండు భాగములుగ రూపొంది నవి - ఈ దేశమున ఇంకొక విధమైన వర్గభేదము లుండెను. ప్రభువులు, సైనికాధికారులు, తమ తమ ఆశయాలు, అవకాశాలు, వ్యక్తిగత అభిరుచులు మున్నగువాని ననుసరించి రాజకీయ చదరంగములో పాచికలాడి ప్రముఖ స్థానము నొందుటకు తహతహలాడెడివారు కొందఱు. మఱికొందఱు వారి జయాపజయాలతో నిమిత్తములేక తమ సుఖము కొఱకే తాపత్రయమునొందు వారు. జూదములో జయమో పరాజయమో అదృష్టముపై ఆధారపడును. కనుక ధర్మములేక న్యాయముగూర్చి వారు విచారించలేదు. అనేక క్లిష్ట రూపాల్లో అవతరించిన స్వార్థము అను వ్యూహములో సమష్టి సంక్షేమ దృష్టి ఎక్కడనో మాయమైనది. ఈ ధర్మాన్ని గ్రహించినవారు, పరిస్థితు లతో ప్రబోధితులైనవారు, సూటిగ బోధించక నిగూఢ తత్త్వరూపమున వెల్ల డించుటవలన తాత్త్విక వివాదములకు దారి తీసినది. షాహ ఇస్మాయిల్ (1781-1831) రచనలవలన రాజకీయ సమస్యల ప్రసక్తి, ప్రభుత్వకర్తవ్యము న్యాయధర్మముల గూర్చిన దృష్టి మున్నగువానిని స్పష్టముగ యుక్తియుక్త ముగ చెప్పనేరక కేవలము విచారము, ఆగ్రహమును మాత్రమే వ్యక్తీక రించినట్లు స్పష్టమగును. కొందఱు కవులు ధనాధికారుల నాశ్రయించి, స్తుతి కావ్యముల రచించి సుఖముగ కాలక్షేపముచేయ, మరికొందఱు భగవంతుని అనుగ్రహము లేక, తోడి మానవుల దయాదాక్షిణ్యములపై ఆధారపడి సన్యా సులుగ జీవించెడివారు. పోషకుని ఆశ్రయము ఉత్తమ కవిత్వావిర్భావమున

కేమాత్ర మంతరాయము కలిగించలేదు. ప్రభువుల నాశ్రయించుట లాంఛన ప్రాయమైన ధర్మమే. అనురాగము, విధేయత అనునవి ప్రేయసికి మాత్రమే పరిమితమై యుండెను. కవి తన వ్యక్తిత్వమును, వ్యక్తిగత అభిరుచులతో కూడిన ధర్మములలో అలంకరించుకొనెడివాడు. అయినను అతడు సంస్కారుల నాశ్రయించి కీర్తినార్జించెడివాడు.

ఇంతేకాక నాటి సంఘమునందలి, స్వేచ్ఛాప్రియులును గౌరవార్హులును అగు స్త్రీ పురుషుల వర్గ మొకటి ప్రధానముగ గణింపదగినది. పరస్పర దర్శనము పరిచయ సంభాషణములకు అతిక్రమముగ స్పర్శకు, తదనంతరము ఆత్మనిగ్రహము కోల్పోవు స్థితికి దారితీయునను అనుమానముతో సంఘము వారిని పరస్పరము దూరముగ నుంచినది. వారినిగూర్చి వర్ణించుటయు అనుచితమని సాహిత్యానికికూడ సుదూరముగ నుంచినారు. పరిణయమునకు దారితీసే ప్రణయము ప్రేమకాజాలదు. వారి వర్ణనలలో 'ప్రేయసి' స్త్రీ పురుషులలో ఎవరికి అన్వయించునో గ్రహించరాని విధముగానుండెను. సుకుమారమైన నడుమును వర్ణింవచ్చును కాని కంఠభాగమునుండి దిగువ గల అంగములను వర్ణించుట అసభ్యముగ భావింపబడెను. కొన్ని యుగములలో ఇట్టి వర్ణనల నశ్లీలముగ గణించలేదు. కాని ఈ నియమమును పాటించుట వలన వారు స్త్రీ అస్తిత్వమును విస్మరించినారని తలపలేము. పారశీక సంప్రదాయము ననుసరించి ప్రేయసిని యువకునిగా భావించిన సందర్భములందు తప్ప ఉర్దూకవుల కల్పనలోని ప్రేయసి రమణి యనియే స్పష్టమగును. సంప్రదాయ బద్ధమగు రీతి, వర్తనమువలననే ఇది స్పష్టముగ తెలిసెడిదికాని ప్రేయసి అంగాంగ వర్ణనలవలనకాదు. ఇట్టి వర్ణనలకు ప్రధానరంగము వేశ్యామందిరమే కాని గృహముకాదు.

క్రీ. శ. 1739 లో రచింపబడిన "మురఖ - యె - దహిలీ" అను గ్రంథమువలన నగరమునందలి సాంఘిక సాంస్కృతిక జీవన రంగమున వేశ్యలు వహించిన ప్రాధాన్య ప్రాబల్యములు స్పష్టమగును. లక్నో మొదలగు మహానగరాల స్థితి దాదాపు ఇటులే ఉండెనేమొ? పందొమ్మిదవ శతాబ్ది రెండవ దశాబ్దిలోని ఒకానొక సంఘటన ఆసక్తికరమైనది. విలువైన వస్త్రాలు ధరించి పల్లకీలు మొదలగు వాహనాల్లో ఢిల్లీ వీధులలో వెళ్లుచున్న మహిళా బృందములను, షాహ మహమ్మద్ ఇస్మాయిల్ దర్శించినాడు. విచారించగా

హారందఋుసు వేశ్య లనియు, ఒకానొక ప్రముఖ గృహమున జరుగ నున్న ఉత్సవములో పాల్గొనుటకు వెళ్లుచున్నట్లును తెలిసినది. వారిలో పరివర్తన కలిగించి సన్మార్గము చూపుటకిదియే తగిన సమయమని భావించి షాహ మహమ్మద్ ఇస్మాయిల్ యోగిని వేషమున వెళ్ళి వేశ్యామందిరములో ప్రవేశించినాడు. సంఘ సంస్కరణ రంగమున సుప్రసిద్ధు డగుటవలనను, ఆకర్షణీయమైన విగ్రహముకల వాడగుటవలనను, గృహయజమానురాలు ఆతనిని దర్శించిన క్షణములోనే గుర్తించినది. వచ్చుటకుగల కారణ మడుగ, ఆతడు ఖురాను సూక్తుల నుదాహరించి హితోపదేశ మొనర్చినాడు. అచట చేరిన వేశ్యాంగనల కనులలో నీళ్లు క్రమ్మినవి. తమలో తాము పశ్చాత్తాప మున కన్నీరు కార్చుట వారికి అలవాటు. ముక్తికై వృత్తిని వదలుట ప్రశంసార్హ మె అయినను ఆచారమునకు విరుద్ధమే. వేశ్యలు తమకు తోచిన పద్ధతిలో జీవితమును కొనసాగించెడివారు. వారి వృత్తి అగౌరవాస్పద మైనను ఒక విధముగ లాభసాటిదిగా నుండెను.

ఉర్దూ కవితా ప్రపంచములో సర్వసాధారణముగ ప్రసక్తికి వచ్చునట్టి 'గోష్ఠి' కేవలము స్నేహితుల సమావేశము కాదు, మిత్రుల వినోద విలాసము లేక సాంస్కృతిక సమ్మేళన మంతకుకాదు. ఇటువంటి సందర్భాలలో ప్రేయసికాని, అనిష్టులైన అతిథులుకాని ఉండరు. వేశ్యాగృహమున అట్టి వారందఋు నుందురు. గాలిబు ఇట్టి వేశ్యా మందిరాన్ని దృష్టిలో నుంచుకొని ఇట్లు వచించెను.

1. అందగత్తెల గోష్ఠిలో క్రొత్తవా రెవరు ఉండరాదని అంటిని ?
ఆమె క్రూర హృదయము నెట్లని వర్ణింతు ?
క్రొత్తవాణ్ణి చేసి నన్నే అచటనుండి వెడలి పొమ్మన్నది.

2. ఆమెకు భక్తి లేకుంటే ఏం ? విశ్వాసహీనురాలవుతే నీ కెందుకు ?
పార లౌకిక చింతనం, స్వచ్ఛమైన హృదయం కలవారు
ఆమె నివసించే 'గల్లీ' లోనికి వెళ్ళట మెందుకు ?

మానవ రూపమున చిత్రింపబడిన ప్రేయసి ప్రసక్తి వచ్చిన సన్నివేశములను, ప్రియునామెచేరి వర్ణించిన విధమును పరిశీలించినచో కవితా

కల్పనము, వేశ్యామందిర యథార్థ దృశ్యము అనగా ఏమియో స్పష్టమగును. మద్యము-మద్యపానమును గూర్చి వర్ణించిన కవులు మద్యపాన మొనర్చియే అట్లు గావించియుందురని ఎట్లు భావించలేమో ప్రేయసితోడి సమావేశముల వర్ణించిన కవు లందరు వారి మందిరముల కేగి దృశ్యముల చూచి యుండు రనుట భావ్యముకాదు. పనికత్తెలు - దాసీలనేకాక వేశ్యలనుకూడ స్వేచ్ఛగా చూచుట కవకాశ ముండెను. వారు వశీకరణ విద్యాపారీణలు - ప్రణయము-విలాస చేష్టలు – ఒయ్యారము - ప్రియుల ననుగ్రహించుట, తిరస్కరించుట, వారికి వెన్నతో పెట్టినవిద్య. ప్రియు డామెతో సుఖించుటకే తపించెడివాడు. అతని కోరికల మన్నించేవారును, తిరస్కరించెడివారును వేశ్యలే – సంగీత నృత్యములతోపాటు వారు చతుర సంభాషణమను కళలో ప్రావీణ్యము గడించినారు. స్వేచ్ఛాపూర్ణమైన సంఘమున వారి మందిరాలే సరసచతుర సంభాషణలకు, శృంగార రసోక్తులకు నిలయములై వర్ధిల్లెను. వినోదములు ఉత్సవములు మున్నగు సందర్భములందు సంపన్నుల గృహములలో పాట కత్తెలను నట్టువరాండ్రను ఆహ్వానించుట ఆచారము. వేశ్యామందిరములకు వెడలుట కాసక్తిలేనివారట్టి సందర్భములందు తమకుగల చతురోక్తి చాతురిని వ్యక్తీకరించెడివారు. ఇట్టి సందర్భములేకాక ఉర్సులు – మహానుభావుల వర్ధంతులు, మొదలగునవి జరుగు వేళలందును నాగరికులకు వేశ్యలను స్వేచ్ఛగా కలసి కొనుట కవకాశములు లభించెడివి. వేశ్యల నిట్టి సమావేశ ములలో పాల్గొనుట కనుమతించెడివారు, ఇట్టి పరిస్థితులను పరిశీలించినచో ప్రేయసి కల్పనలోని ఆంతర్యము సుస్పష్ట మగును. సంసారపు బంధనాలు, లేని భోగ్యస్త్రీలు వేశ్యలు – శృంగారరసాస్వాదనాసక్తి, రసికత మూర్తీభ వించిన ఈ వేశ్యలు ప్రేయసి కల్పనలకు తోడ్పడి యుందురు.

పందొమ్మిదవ శతాబ్దినాటి కపటప్రవృత్తి, సంఘమును సంస్కరించ వలయునని చిత్తశుద్ధి గల కుతూహలము, ఈ సత్యమును కప్పిపుచ్చుటకు ప్రయత్నించినవి. మఱియొక వైపు సంప్రదాయజ్ఞులు, మదిర, పానశాల మున్నగువానివలె ప్రేయసికూడ ఒకానొక కల్పనమునకు ప్రతీకలనియు, అవికేవలము భౌతిక సుఖమున కన్వయించవనియు నిరూపించుటకు ప్రయ త్నించినారు. ధర్మజ్ఞులీ వాదమును సమర్థించినారు. ఈ అంశమును బల పఱచుటకు వారికి వేరు ఆధారములతో నిమిత్తము కలుగలేదు. ఏలన సూఫీ

కవితాతత్త్వము ప్రతి భౌతిక స్థితిని, ప్రత్యేకముగ ప్రేయసీ ప్రియుల సంబంధాన్ని - దివ్యతత్త్వమునకు ప్రతీకలుగ స్థాపించి అదియే సత్యమని చాటినది. కాని ఈ కాలమునాటి సాహిత్య విమర్శకులు కవి వర్ణించిన ప్రణయమును అభూతకల్పన మను అపనిందనుండి ఏల తప్పించలేక పోయిరో అర్థముకాదు.

ఇక సాహిత్యముపై ప్రభావమును ప్రసరింపజేసిన సాంఘికాంశముల సంగతి:—సమాజమునం దొకింత పలుకుబడి, స్థానముగల వ్యక్తి పాదచారియై వెడలెడివాడు కాడు. ఏదియో నొక వాహనముపై వెళ్లుట సభ్యతగా భావింపబడెను. బ్రిటిషువారి కాలమున గుఱ్ఱపు బగ్గీ లుండెడివి. నగరము నందు కాక సుదూర ప్రాంతములకు వెళ్లునపుడు మాత్రమే అశ్వముల నధిరోహించి పోవువారు, గౌరవ నాగరికులు నానావిధములైన వాహనములలో - పల్లకీలవంటి వానిలో - పయనించెడివారు. ఇతర కారణములు లేక ఫలితములెట్లున్నను - ఒకవ్యక్తి స్వేచ్ఛగా వీధులలో విహరించుటకు, నిలబడి వచ్చి పోవువారిని చూచుటకు, శరీరమున కవసరమగు వ్యాయామము నొనర్చుటకు, సామాన్య మానవులతో తిరుగుటకు వీలులేకుండెనని స్పష్టమగుచున్నది.

వీధులలో సంచరించుటయే నాగరికతకు విరుద్ధముకాదు. ఇతరాంశములందును ఇట్టి నిర్బంధము లుండెను. మానవులందఱు సమానులని ధర్మశాస్త్రము చాటినది - దాని నెవరును ధిక్కరించలేదు. కాని ఉన్నతులు సామాన్యులు సంఘమున సమానముగ కలిసి మెలసి వర్తించవలయునని ఆదేశించలేదు. వివిధవర్గముల వారిని పరస్పరము విడదీయు సాంఘికాచారములు విధిగ పాటించబడినవి-కొన్ని స్థితిగతులు, వర్తనవిధానములు తదితర మహమ్మదీయ రాజ్యములలో లేనందున ఈ పద్ధతి కేవలము వర్ణవ్యవస్థ ననుసరించక పోవచ్చు. కాని ఈ ఆచారములు అస్తిత్వమును కాదనలేము. వారు కవిని, మానవులకును కవిత్వమును సామాన్య భావములకును సుదూరముగ నుంచినారు. ఈ స్థితిని త్రోసిపుచ్చిన కవి నజీరు అక్బరు ఆబాదియే. ఈతడు (1739-1830) కవిత్వము నీ నియమ నిబంధనల వలయము నుండి రక్షించినాడు. ఈతని కవితా సౌందర్యమును దర్శించినచో ఉర్దూ కవి లేనిపోని నియమములను మన్నించి ఉత్తమ కవిత్వ సృష్టికే విధముగ

దూరమయ్యెనో స్పష్టమగును. కవులు - విమర్శకులు నజీరును గౌరవించ లేదు. ఆతని ప్రభావము సమకాలిక కవులపై అంతగా ఉన్నట్లులేదు. కవి తన అనుభవాలను వ్యక్తిగత భావములుగనే గ్రహించవలయుననిరి. తన పరిసరము నందలి మానవుల సుఖదుఃఖములకుభిన్నమైన వానిగ గణింపక తప్పలేదు.

వివిధ వర్గముల ప్రజల నొకచో చేర్చు సేతువుగ పనిచేయు రాక పోకల సౌకర్యముకూడ భావసమైక్యతను కలిగించలేదు. ప్రయాణము కష్ట తరమై యుండెను. గ్రామీణ వాతావరణము ప్రేమించుటకు సుఖించుటకు తగినదికాక భయాస్పదముగ తోచినది. గాలిబు ఒక సందర్భమునం దిట్లు వచించెను.

> కనిపించిన ప్రతి దృశ్యము ఎదనానంద పఱచవలె
> యాత్రతో గడిపిన జీవిత మొక అనుభూతి
> అతి మధురమైనది.

ప్రయాణ మాతనికి తలనొప్పిగ నుండెను. ఈ స్థితినుండి తప్పించు కొనుటకు ప్రయత్నించినాడు. కలకత్తా ప్రయాణ సందర్భమున ఆతడు మధ్య మధ్య మజిలీచేసిన నగరములలో ప్రజలను కలిసికొనినాడు. బనా రసు నగరమును చూచి ముగ్ధుడై దాని సౌందర్యమును వైభవమును సముచితముగ వర్ణించినాడు. కలకత్తా నగరమునుకూడ అతడు ప్రస్తుతిం చెను. ఈ ప్రయాణ సందర్భము నం దాత డనుభవించిన ఆనంద మిదియే.

చట్టము - ఆచారము మున్నగు వానివలన వ్యక్తి సంఘమునకు, కులమునకు, ఒక ప్రత్యేక వర్గమునకు అధీనుడై యుండెను. స్వాభిమానులు వ్యక్తిగతమైన మానసిక వ్యవస్థతోడి జీవితమునందే ఆసక్తి వహించుట కిదియు నొక కారణము. అంతియేకాక ఆనాడు వివిధ పరిమిత దృక్పథా లతో ఆలోచించుటయు, జీవించుటయు, పరిపాటిగ నుండెను. కవిత్వమునకు రాజకీయ జీవితమునకు గల ప్రత్యక్ష సంబంధాన్ని నిరూపించగలిగిన రీతిలో కవి దృష్టిని ఆనాటి రాజకీయములలో గలిగిన మార్పులు ఆకర్షించి నట్లు కనిపించదు. సయీద్ అహమదు షహీదు, షాహ ఇస్మాయిల్ షహీద్

మొదలగు మహమ్మదీయ సంస్కర్తలు జాతియొక్క ప్రజాభిప్రాయముపై ప్రభావమును గలిగించినారు, కాని వారును ఉపేక్షింపబడినట్లే తోచును.

గాలిబు కవితలో పవిత్రమానవుడు, ఆచార్యుడు, సంప్రదాయము ప్రకారము వర్ణింపబడినవారే కాని సమకాలికులుకారు. గజలు స్వరూప మింకొక విధమైన నిర్బంధమును సూచింపజేయును. రెండేసి పాదములు ముక్తకమువలె స్వతంత్రమై పూర్వాపరభాగములతో నెట్టి సంబంధములేక యుండును. ఏ భాగమున కా భాగము స్వయంపూర్ణమై ప్రత్యేక భావమును లేక భావ చిత్రమును సంపూర్ణముగ వ్యక్తీకరించును. కొందరు కవులు కొన్ని సందర్భములలో భావమును మూడు నాలుగు పాదములలో వ్యక్తీక రించిరి. ఇట్టివి సంఖ్యలో చాల తక్కువ. వీనిని జూచియే విమర్శకులు ఆ కవికి భావమును సంగ్రహముగ ఒకటి రెండు పాదములలో వ్యక్తీకరిం చెడి శక్తి లేదని విమర్శించిరి. స్థిరమైన విలువను సాధించలేక పోతిమను నిరాశకాక ఈ విధమగు సంకుచిత దృక్పథము సర్వత్ర అంగీకృతమగు టచే గాలిబు యుగమునాటి రాజకీయ జీవితమునందలి సంఘటనలగూర్చి వైముఖ్యము గనిపించును. కవులలో వైయక్తిక దృక్పథము ఒకవిధమైన అద్వైత సిద్ధాంతమువలన పరిపుష్టి నొందినది. ఈ తత్త్వము ననుసరించి మానవునకు భగవంతునకు ప్రత్యక్ష సంబంధ మేర్పడినది. తనకుగల విశ్వాసము, సంఘము, వర్తనము మున్నగు వానినిగూర్చి జీవన విధానము నకు రూపకల్పన మొనర్చుకొను స్వేచ్ఛ ఉండెను. ఈ వ్యక్తి తన అస్తిత్వ మును గొప్పతనమును నిరూపించుకొన వలసివచ్చినది. అతడు జీవన మార్గము నన్వేషించుకొని ధ్యేయమును నిరూపించుకొనుటకు ప్రయత్నించి నాడు. ప్రేయసితో ఐక్యమును తప్ప తక్కినవాని అస్తిత్వమునే నిరా కరించినాడు.

# గాలిబు - వ్యక్తి

గాలిబు మహాకవి అవసానదశలో వ్రాసిన లేఖలలో నొక సందర్భమునం దిట్లు వచించెను: "ప్రపంచాలు రెండు. ఒకటి పరలోకము-భూమినీరు గల ఈ లోక మింకొకటి. ఈ లోకమున చేసిన పాపములకు తగిన శిక్ష పరలోకమునం దనుభవించక తప్పదని సామాన్య నియమము. కాని పరలోకమున పొరపాట్లు చేసినవారు శిక్ష నొంది భూలోకమున మానవ రూపమున జన్మించుటయు సంభవమే. నే నీ ప్రపంచ మను కోర్టులో ఆజ్ఞాపితుడనై హి. 1212 సంవత్సరము రజ్జబు మాసములో హాజరైనాను. దాదాపు పదమూడేండ్లు కోర్టు నిర్బంధమున నుంటిని. హి. 1225 సం॥ 7 రజ్జబు (1810) నాడు జీవితాంత కారాగార శిక్ష విధింపబడినది. నా కాళ్ళకు సంకెళ్ళువేసి ఢిల్లీయే కారాగారముగ నుంచినారు. సృజనాత్మక గద్య పద్యము లొనర్చవలయునని నిర్బంధ శిక్ష - కొన్ని సంవత్సరముల తర్వాత నేను జైలు నుండి తప్పించుకొని పారిపోయి తూర్పు ప్రాంతములోని నగరములలో దాదాపు మూడేండ్లు పరిభ్రమించినాను. కలకత్తాలో పట్టుబడి మరల మూడేండ్ల కారాగారవాసము ననుభవించినాను. మరల పారిపోవుదు నేమో అని ఈసారి కాళ్ళకు సంకెళ్ళతో పాటు చేతులకు బేడీలు వేసినారు. ఈ బంధనములతో నా కాళ్ళు చేతులు చితికిపోయినవి. నిర్బంధశిక్ష - సృజనాత్మక రచన-కష్టతరమైనది. నా శక్తి అంతయు క్షీణించినది. కాని నేను సిగ్గుమాలిన వ్యక్తిని. గత సంవత్సరమే మరల ఈ బంధనాల నొక మూలకు పారవైచి జైలు నుండి తప్పించుకొని పారిపోయి మీరటు, మురదాబాదు మార్గమున రాంపూరు చేరినాను. అచట దాదాపు రెండు నెలలు గడిపి మరల అధికారుల చేజిక్కితిని. ఇక ఎన్నడు పారిపోనని ఒట్టుపెట్టుకొనినాను. వెళ్ళదలిచినను పారిపోలేని స్థితి కలిగినది. పరుగెత్తుటకు శక్తి లేదు. నా కీ బంధము నుండి విముక్తి ఎపుడు లభించునో తెలియదు. ఈ సంవత్సరాంతమున స్వేచ్ఛ లభించవచ్చునని ఆశ ఇసుమంత కలదు. ఇపుడు వదలినచో నేను చక్కగా పరలోకమున కేగ గలను. ముక్తుడైన నిర్బంధితుడు-తన ఇంటికి గాక మరి ఎక్కడికి వెళ్ళగలడు?"

మనోహరములగు గాలిబు లేఖలలో దర్శింప నగు చతుర సరసోక్తుల కిది చక్కని ఉదాహరణము-గాలిబు రెండు మారులు చేసిన ప్రయాణములు, కొన్ని తేదీలు-అనారోగ్య, జరాభారము వలని అశక్తత - అనునవి తప్ప తక్కినవి అన్ని ఆ సమయముననందే విభిన్న మానసిక ప్రవృత్తితో వ్రాసిన ఇతర లేఖలలోని అంశములకు విరుద్ధముగ నున్నవి.

గాలిబు తన అభిజాత్యమును వంశ గౌరవమును సగర్వముగ చాటి నాడు. అత్యంత ప్రాచీన వంశముతో తనకు సంబంధ ముండినట్లు వివ రించినాడు. రాజగురువు లగు జౌఖు మహాకవిని ఒక సందర్భమునం దీతడు అనుచితముగా ప్రస్తావించిన సందర్భములో బహాద్దురుషా అభ్యం తరమును తెలిపినట్లు ప్రతీతి. గాలిబు ఒకానొక గజలులో ఇట్లు వచించెను:

నా వంశీయులు నూరు తరాలనుండి
రణరంగ పారీణులు
ఏదియో గౌరవ పదవినొందుటకై
కవిత వ్రాసే కర్మ నాకేటికి?

కాని గాలిబు తండ్రి, తాత ఏవిధమైన ప్రశస్తిని పొందలేదు. వారి వంశము, సైనికవృత్తి, అధికారపదవి మొదలగు వాని వలన గాలిబు మహోన్నత స్థానము నొందినట్లుగ సగర్వముగ చెప్పినాడు. మిర్జా అసదుల్లాఖాను అను నామమే అతని దర్జాను సూచించు చున్నది. క్రీ. శ. 1850 లో బహ దురుషా చక్రవర్తి గాలిబు మహాకవిని నజీముద్దౌలా, దబీరుల్ముల్కు, నిజాముజంగు అను గౌరవ బిరుదములతో సత్కరించుట అతని ప్రశస్తి నినుమడింప జేయుచున్నది. గాలిబు సద్వంశమున జన్మించి జీవితాంతము మహావ్యక్తిగా పేరొందినాడు. ఆయన అనుభవించిన కష్టములు కోరి తెచ్చు కొనినవే. ఈ లోకమునం దాత డొనర్చిన కార్యముల వలన కలిగినట్టివే. ఇచట పరలోక ప్రసక్తి ఏ మాత్రము రాదు.

తండ్రి మరణానంతరము గాలిబు తన తాత, పినతల్లుల యొద్ద పెరిగినాడు. వారు సుసంపన్నులు కాకున్నను మంచి స్థితిలో నున్నవారే. గాలిబును నవాబు కొడుకువలె గారాబముగ పోషించినారు. అతడు సుందరా కార శోభితుడగుటచే అందరి నాకర్షించి వారి ప్రేమానురాగములకు పాత్రుడై

యుండును. గాలిబు బాల్యమున అధిక సమయము ఆటపాటలతో, గాలి పటముల నెగురవేయుటతో కాలక్షేపము చేసినాడు. ఈ కాలమునం దాతని కేమాత్రము విద్య అలవడెనో తెలియదు. పదమూడవయేట ఉమ్రావు బేగమును వివాహ మాడుట అతనికి లభించిన సుఖమయ జీవితములో ఒక భాగము - అతని భవిష్యత్తును గూర్చి ఎవరును పట్టించుకొనలేదు. గాలిబు ఎట్టి సైనికశిక్షణము నొందలేదు. ఏదేని ఒక ఉద్యోగమును, ప్రభుత్వోద్యోగము నైనను చేయుటకు సిద్ధముగా లేకుండెను. అతనికి ఫిరోజు పూరు జర్కా నవాబుల వంశీయుడుగ సంవత్సరమునకు 1500 రూపాయల భృతి లభించెను. ఇద్ద రన్నదమ్ములు దానిలో సమానభాగమును గ్రహించెడి వారు. అది వారికి సరిపోవునట్టి భృతియే. కాని గాలిబు అవసరముల కది సరిపడలేదు. ఆదాయమును పెంచుకొనుటకు గాలిబు మార్గాంతరముల నన్వేషించక ఈ జాగీరు నుండియే ఇంకను అధిక భృతిని పొందుట కెన్నియో మారులు ప్రయత్నించెను. యౌవనదశ నుండి మితిమీరిన వ్యయ మున కలవడి నందున నానా కష్టములపాలై చివరికి అప్పులు చేయక తప్పలేదు. అలవాట్లు మార్చుకొనుట లేక పశ్చాత్తాపము నొందుట అతని ప్రకృతికి విరుద్ధము.

''నేను యువకునిగా నున్నప్పటి మాట – ఒకానొక పరిపూర్ణదేశికుడు 'పవిత్రవిధానము, సన్యాసవృత్తి అతనికి నచ్చలేదని; సుఖజీవన విధానము, పాపకృత్యములు దూష్యములు కావని స్పష్ట మొనర్చి ఆహార విహార పానీయములతో సుఖముగా కాలము గడుపవచ్చు నని తెలిపినాడు. పంచదార రేణువుపై వ్రాలెడి ఈగ వంటి వానినే కాని తేనెపై వ్రాలిన తేనెటీగ వంటి వానిని కాదు' అని గుర్తించవలయునని అతని ఉపదేశము. వారి ఉపదేశ మును నేను ప్రత్యక్షరము పాటించినాను.''

గురువుగారి ఆదేశమును గాలిబు ఒకడే అనుసరించలేదు. అతనికి బంధు మిత్ర వర్గము కూడ కలదు. వారు భోగానుభవముతోపాటు కవితా వ్యాసంగమున పాల్గొనెడివారు. మొదట 'అసదు' అను ఉపనామమున వ్యవహృతుడైన గాలిబు కవి సరస కవితా శక్తి వలన స్ఫురద్రూపము వలన అందరి నాకర్షించి ఆ బృందమునకు నాయకుడై యుండును–ఒకానొక మిత్రుడు పంపిన చిత్రపటమును స్వీకరించి సమాధాన పూర్వకముగ తన వికృతరూపము నిట్లు వర్ణించెను :

"నీవు పంపిన నీ చిత్రపటము నా కనుల కెంతయో ఆనందమును ప్రసాదించినది. నేను కూడ ఎత్తుగను, ఆకర్షణీయముగను నున్నందున నీ మహోన్నతాకారము వలన నే నే విధమైన ఈర్ష్య నొందుట లేదు – నవ యౌవనమున గౌర వర్ణముతో భాసిలి యుండెడి నా శరీరకాంతిని రసికులు చూచి ప్రస్తుతించెడివారు. ఆ కారణము వలన నీ గోధుమవన్నె శరీర వర్ణ మును చూచి నపుడు ఇసుమంత అసూయ కలుగ లేదు. అప్పటి నా శరీర తేజస్సును తలచుకొనిన ఇపుడు ఎదపై పాము పారాడినట్లు తోచును. నున్నగా క్షవరము చేసికొనిన నీ ముఖము చూచి నేను అసూయతోపాటు విచార మును కూడ పొందుచున్నాను. అది పూర్ణసుఖముల స్మరింపజేయు చున్నది. ఇపుడు నే నెట్లు మారితినో ఏ విధముగ వివరింతును? గడ్డము, మీసము తెల్లబడుచున్నవి. గడ్డము చేసికొనిన మూడవ నాటికే నా చెక్కిళ్ళపై చీమలు తెల్లని గుడ్లు పెట్టినట్లుండును. ఈ వేషమునకు తోడుగ ముందటి పండ్లు రెండు ఊడిపోయినవి. పండ్లపొడీ వాడుట, క్షవరము చేసికొనుట మానినాను. ఈ వికృత నగరమున ఫేషనులో ఒక విధమైన సామ్యము కలదని జ్ఞాపకముంచుకొనుము. మతాధికారి, మతప్రచారకుడు, పూటకూళ్ళ వాడు, చాకలి, సాలెవాడు, కూరలమ్ము వాడు – అందరును గడ్డాలు పెంచు కొనినవారే. నీ విధేయ సేవకుడు గడ్డము పెంచిన నాటి నుండి క్షౌర మారంభించినాడు.

ఇతరులు వర్ణించిన గాలిబు రూపమును జూచిన అతడు ఆభిజాత్య మును సూచించే నాసికతో విశాల సుందర నేత్రములతో అందముగ నుండెడివాడని స్పష్టమగు చున్నది. మనోజ్ఞమైన ఆకారముతో అతడు అంగనల నెందఱినో ఆకర్షించి యుండును. స్నేహితులు అనుచరులు నున్నగు వారితో అతడు వేశ్యామందిరములకు వెళ్ళినపుడు ఆకర్షణీయ మైన సౌందర్యముతో సరసోక్తి చాతురితో వారిని మోహింపజేసియుండు ననుట కేమాత్రము సందేహము లేదు. ఒకసారి పంచదారపై ఈగవలె కాక తేనెటీగవలె తేనెపై వ్రాలినాడు. మిర్జా హాతిమ్ అలీ బెగ్ మహర్ అను మిత్రుని ప్రేయసి చున్నీ జాన్ మరణించిన సందర్భమున గాలిబు తనకు గలిగిన విచారము నిట్లు వ్యక్తీకరించెను:

"మజ్నూవలె ప్రేమించినపుడే ప్రియుని ప్రత్యేకత వెల్లడియగును. లైలా అతని జీవితకాలమునందే మరణించినది. నీ ప్రేయసి నీ కన్నుల యెదుట కన్ను మూసినది. ఒక విధముగ జూచిన నీవు మజ్నూ కంటె మించినవాడ వని తోచును. లైలా తన ఇంటిలో అసువులు వీడినది. నీ ప్రేయసి నీ గృహములో నీ సమక్షమున ప్రాణములు కోల్పోయినది. మొగలులు కఠినాత్ములు – ఒకరి కొరకు ప్రాణము లర్పించుటకును, వారి ప్రాణములు తీయుటకును సిద్ధమే. నేను పుట్టినది మొగలు వంశము. నా జీవిత కాలమున ఎందరి గుండెలనో దోచుకొనిన 'డోమ్నీ' ప్రాణముల హరించినాను. భగవంతుడు వారి ఆత్మలకు శాంతి నొసగుగాక! ప్రేమించిన వారిని మృత్యువు దూరముచేసినందున, బాధపడే నిన్ను నన్ను కూడ పరమాత్ముడు కరుణించు గాక! ప్రేమ వ్యవహారము వదలి దాదాపు నలువదిరెండేం డ్లయినది. ఇపుడీ విద్యలో నేను అమాయకుడను. కాని ఒక్కొక్కసారి నాటి ప్రణయము స్మృతికి వచ్చును. నే నామె నెన్నడును మరచిపోలేను.

మీర్జాహాతిమ్ పేర వ్రాసిన మఱియొక ఉత్తరములో గాలిబు ఇట్లు వచించినాడు. "కొందఱు స్నేహితుల సమక్షములో నేనొకసారి మీర్జా హాతిమ్ అలీని చూడవలయునను కోరిక యున్నట్లు తెలిపినాను. అతడు కుశలుడనియు, రసికత మూర్తీభవించిన వాడనియు విన్నాను. నాకు సన్ని హితుడైన నవాబు హామిద్ అలీఖాను యొద్ద ఉంటున్నపుడు "మిత్రమా! నీ ప్రావీణ్యము మొగలుజాన్ వలన విన్నాను. నేను ఆమె కలిసి గంటల తర బడి స్వేచ్ఛగా మాట్లాడుకొనువారము – నీవు ఆమెను ప్రశంసించి వ్రాసిన గేయమును కూడ చూపినది."

దీనివలన ఆనాడు నవాబులకు వేశ్యలకు గల ప్రగాఢసంబంధము తెలియుచున్నది. గాలిబ్ డోమ్నీని చేరదీసి యుండును. ఆమెతో ప్రత్యేక మైన అనుబంధముకూడ కలగియుండును. మిత్రులు కొందఱు ఆమెను దర్శించి సరసోక్తులతో మురిపించేవారు. ఆమెతోపాటు మరికొందఱు వేశ్య లండిరి. ఈ సమావేశాలు వంతుల ప్రకారము వివిధ వేశ్యా గృహాలలో జరిగెడివి – సంపన్నులగు రసికు లిట్టి గోష్ఠుల నేర్పాటు చేయుచుండిరి. గాలిబు తన అందమైన రూపమును వ్యక్తిత్వమును తక్కువగా అంచనా

వేసికొని యుండును. డోమ్నీ ఆతనిని ప్రేమించినది. ఇరువురిలో ఎవరికిని ఆ విషయమున ఆసక్తి లేకుండెను. తనకు సంబంధించని విషయములో ఆమె యెట్టి జోక్యమును కలిగించుకొనలేదు. గాలిబు కవి ఆమెనుగూర్చి వ్రాసిన స్మృతి గీతిక గుండెను చీల్చివేయు నట్లున్నది. అంతియే కాక అది ఆతని మానసిక స్థితినికూడ తెల్పుచున్నది. సుసంస్కృతమైన కవితా ప్రణయ వ్యాపారమునుండి లౌకికమైన సుఖమునకు తపించినవిధము స్పష్టమగు చున్నది.

నా కొఱకు నీవు భయముతో చలించియుందువు. ఉపేక్షాభావమున వర్తించుట ఏల మానితివి? దుఃఖముతో ఎదను నింపుకొను కోరిక లేనపుడు నా దుఃఖములో పాలుపంచుకొనుట కేల పూనుకొంటివి? నే నొంటరిగా నుండుట నీ కిష్టమే లేనపుడు నాపై సానుభూతిని చూపవలయునని ఎందుకు సంకల్పించితివి? జీవితాంతము విశ్వాసమున నుండెదనని శపథ మొనర్చితివి కాని జీవితమే క్షణభంగురమైనపుడు అది ఎట్లుపకరించును? ప్రణయము యొక్క ఔన్నత్యమును పాటించుటకు ఇంతకంటెను అన్యులేమి చేయగలుగు దురు? గులాబీల వెదజల్లు సౌందర్య మంతరించినది – నీ విపుడు మట్టిని పూలతో అలంకరించుచున్నావు. జీవిత వాతావరణ మిపుడు కారాగారము వలె నున్నది. ఇటువంటి వాతావరణమే నీకు సరిపడలేదు. సౌందర్య కర వాలమును ఝళిపించే నీ హస్తము నేడు శక్తిహీనమై పోయినది. నాగుండె ఆ అమాతపు ఆనందాన్ని రుచిమాడలేదు. నిగూఢమైన ప్రణయ శపథ తత్త్వము నేడు నేలపాలైనది. స్నేహమార్గ మీ లోకమునం దంతరించినది. చుక్కల లెక్కించుటకే కనుల కలవాటైనపుడు వర్షర్తు నిశీథముల నేనెట్లు గడవగలను? చెవులు ప్రణయసందేశమును వినలేవు. కనులు సౌందర్య స్వరూపమును దర్శించలేవు. ప్రేమాస్పదమైన గుండె ఇంతటి వియోగము నెట్లు భరింపజాలును? ఇట్టి దుర్దశ విధి లిఖితమైనపుడు అది అపరిచితునిగ నున్నచోట గలిగిన బాగుండును! కాని ఈ పరాభవ బాధను ఢిల్లీలో అనుభ వించ వలయునని నా నొసట వ్రాసియున్నది. విధివిలాసమున కేమి చేయ వలయును?

ఈ స్మృతి గీతిక వంటిది ఇంకొక గజలు ఇట్లున్నది :—

హృదయపు గోష్ఠికి అపుడపుడే వచ్చినవారూ!
మీ కొక హెచ్చరిక : కవితాగానపు మైకం అదొక రకం!

మీకు కనులుంటే చూడండి! చెవులుంటే వినండి.
సాఖీ దివ్యసౌందర్యం చూడగానే
ప్రాణాలు పైపైన ఎగిరిపోవును.
గానం చేసేవారు నిన్ను దోచుకుంటారు
రాతిరి గోష్ఠి, తోటమాలిని బదివోలె
బహువర్ణ భూయిష్ఠం, సౌరభసంవాసితం
ఆ అందము!!! దివ్యజ్యోతి సదృశం
అది కనులకు విందు,
ఆ గానము!!! మాధురీపూరితం
అది చెవులకు విందు.
రేయి గడచిన ఆ ప్రదేశం శోభావిహీనం
ఒకే ఒక ఆరినదీపపు వత్తి - విచారమగ్నం, అశ్రుపూరితం
గడచిన రాత్రికి మౌనరూప సంకేతం.

సాంఘిక జీవనమున వేశ్యామందిరము ప్రధాన కేంద్రమైనపుడు స్వేచ్ఛగల గృహిణులు తెరమఱుగున పడుట సహజమే. గాలిబు జీవితమును గూర్చి రచించిన ఆధునిక చరిత్రకారు లొకరు అతడు తన భార్యనుగాఢముగ ప్రేమించెనని తెలుపుటకు ప్రయత్నించినారు. కాని గాలిబు దంపతుల ప్రవృత్తులలో ఎట్టి సామ్యము లేకుండెను. గాలిబు కవికి ధనమనిన నిర్లక్ష్యము - సుఖముగ కాలక్షేపము చేయుట అతని నైజము. సక్రమ జీవన విధానమునం దాసక్తిగల గృహిణికి గాలిబువంటి వానితో సంసారము చేయుట కష్టతరమై తోచియుండును. ఉమ్రావుబేగమునకు ఏడుగురు జన్మించిరి. కాని వారందరును శైశవ దశలోనే కాలధర్మము నొందిరి. గాలిబువంటి భర్త గల గృహిణికి ఇది మఱింత బాధాకర మైనది. ఉమ్రావుబేగము భర్తచే మద్యపానము మాన్పించుటకు విఫల ప్రయత్న మొనర్చినది. గాలిబు నిత్య ముపయోగించు పాత్రలను శుద్ధిచేయుట మాని వాని నొక మూల ఉంచినది. గాలిబు ఆమెకు కష్టము కలిగించునట్లుగ వర్తించుట కిచ్ఛగింపలేదు. ఎవరికి వారు తమ దారిలో నడచినారు. ఉమ్రావుబేగము క్రమముగ ఆధ్యాత్మ విషయమునం



Indian ... ance
11766 3.

దాసక్తమైనది. ప్రార్థనలు ఉపవాసములు మున్నగు వానిచే కాలక్షేప మొన ర్చినది. గాలిబు నాతని విశృంఖల జీవన విధానమునకే వదలినది. వివాహము యావజ్జీవ నిర్బంధమని గాలిబు విమర్శించిన విధము చిత్తశుద్ధితో చేసినట్టిదే. గాలిబు లేఖ లన్నియు రమణీయ ప్రసంగముల ఖండికలు. అందమైన అబద్ధాలతో పూర్ణములు - జీవితములో సుఃఖముతో రాజీపడిన చిత్త వృత్తికి, ఉదాత్త భావములకు రమణీయ ప్రతిబింబములు.

చతుర సంభాషణము, కవితావ్యాసంగము తప్ప గాలిబు కార్యక్రమములలో పేర్కొనదగినది, ఆర్థిక పరిస్థితిని మెఱుగుపఱచుకొనుట కొనర్చిన ప్రయత్న మొకటియే. ఫిరోజ్‌పూరు జిర్కా లోహారు జాగీరునుండి అనిక భృతినొందుటకు దాదాపు 1825 నుండి 1857 వఱకు ప్రయత్నమును కొనసాగించెను. ఈ సందర్భమునందే గాలిబు కలకత్తాకు వెళ్లెను. అతనికి ప్రయాణమనిన బద్ధకము - అనిష్టముకూడా. అయినను విధిలేక వెళ్ళినాడు. ఈ ప్రయాణమువలన అతడు నూతన ప్రాంతములను ప్రజలను భారత దేశము నందలి ఆధునిక నగరమును చూచుట కవకాశము కలిగినది. జాగీరునుండియేకాక మార్గాంతరము వలనను ధనార్జనగూర్చి ఆలోచించెను. చివరిదశలో రాంపూరు నవాబుల ఔదార్యమువలన తన కృషి ఫలించునని ఆశించెను. ఇప్పుడు ప్రకటితమైన గాలిబు లేఖలలో నవాబునకు ఆర్థిక సహాయము నపేక్షించి వ్రాసిన లేఖలు అధికముగా నున్నవి. అవి చదివినపుడు ఎంతయు బాధను కలిగించును. క్లిష్టమైన ఆర్థిక పరిస్థితులలో దాతలను ప్రస్తుతించిన సందర్భములందు ఆత్మాభిమానమునకు విఘాతము కలిగినట్లు గాలిబు కవి ఏల భావించలేదో ఆశ్చర్యము కలుగును. 1842 లో అపుడే స్థాపితమైన ఢిల్లీ కాలేజిలో ప్రభుత్వోద్యోగిగా చేరుట ఆత్మ గౌరవ భంగకరమని నిరాకరించినాడు. ఆ ఉద్యోగమునకు గాలిబు మహాకవి పేరు సూచింపబడగా, ప్రధాన కార్యదర్శియగు థామ్సన్ ఆతనిని వచ్చి కలిసి పొమ్మని వర్తమాన మంపెను. గాలిబు పల్లకిలో వెళ్ళి తన ఆగమనమును థామ్సన్ గారికి తెలిపెను. గాలిబును లోనికి రమ్మని థామ్సన్ కబురంపెను. థామ్సన్ స్వయముగ కావలికి వచ్చి తన నాహ్వానించునని గాలిబు ఆశించి నిరీక్షించెను - థామ్సన్ లోపల ఆతనికై ఎదిరిచూచెను. కొంత సమయము గడచిన అనంతరము గాలిబు లోనికి రాని కారణ మాతడికి తెలిసెను. థామ్సన్

ఈవలికి వచ్చి ప్రవేశద్వారము కడ నిలిచి అతిథులకు మాత్రమే స్వాగత మొసగుట దర్బారు సంప్రదాయమనియు ఉద్యోగార్థులగు అభ్యర్థులనట్లు అహ్వానించుట లేదనియు స్పష్టమొనర్చెను. ప్రభుత్వోద్యోగము గౌరవము నినుమడింపజేయునే కాని తగ్గించదని ఆశించితినని గాలిబు సమాధాన మొసగి వెడలిపోయెను. ఈ సంఘటనవలన ఆత్మాభిమానము, దర్బానుగూర్చి గాలిబు నకు గల అభిప్రాయము స్పష్టమగుట లేదుకాని గాలిబునుగూర్చి పరిశీలన మొనర్చువారికి అతని మహోన్నత వ్యక్తిత్వము, దర్బాగలవాడయ్యు, దిన వెచ్చమునకు తపించినస్థితి, అనిశ్చిత వాతావరణము, అప్పులిచ్చినవారివలన బాధ - సహాయము చేయజాలక రాజులు నవాబుల ఔదాసీన్యము, అను అంశములు వ్యక్తమగును. ఇట్టి పూర్వరంగము తెలియనిచో అతని వ్రాతలు కేవలము కవి ఊహలుగ, అభూతకల్పనలుగా నిలిచి పోవును.

పరిస్థితు లెట్లున్నను గాలిబు హాస్య చమత్కృతులు వీడలేదు - చేతిలో చిల్లిగవ్వ లేని స్థితిలో గాలిబు తన ఉన్నికోటును విక్రయించిన సందర్భమున ఒక స్నేహితునకు "అందరు రొట్టెలు తిని కడుపు నింపుకొన్నచో నేను నా బట్టల నమ్ముకొని జీవించుచున్నాను" అని వ్రాసెను. జీవితావసాన దశలో గాలిబు "కాలనిర్ణయ సూచి" పద్య రచనయం దాసక్తి చూపెను. అత డొకా నొక పద్యమున తన మరణకాల సంవత్సరమును సూచించి యుండెను. ఆ సంవత్సరమున ఢిల్లీ నగరమున భయంకరమైన ప్లేగు వ్యాధి వ్యాపించెను. కాని అతని కెట్టి అపాయము కలుగలేదు. "నా జోస్యమునం దెట్టి లోపము లేదు - అంటువ్యాధికి గురియై మరణించుట నాకు నచ్చలేదు - అంతియకాక అది నా దర్జాకు భంగకరమగును. పరిస్థితులు కుదిరిన తర్వాత ఆ విషయ మును గూర్చి ప్రశాంతముగ నాలోచించెదన"ని గాలిబు ఈ సందర్భమున వచించెను.

ఢిల్లీలో క్రీ. శ. 1857 నాటి కలజడి అనంతరము, పంజాబు ప్రభుత్వ అనువాద విభాగమున ఉన్నతోద్యోగిగ నుండిన మోతీలాలు, కమీషనరు మెట ఢిల్లీ వచ్చియుండెను. దేశాభిమానియైన ఈతనికి కవులపట్ల ఆదరాభి మానము లధికము. ఆతడు గాలిబును సందర్శించుటకు వచ్చెను. ఆ కాల మున గాలిబు జీవనభృతిని నిలిపివేసిరి. దర్బారునకు అధికార పూర్వకముగ ఆతని రాకనుకూడ నిషేధించి యుండిరి. ఈ కారణమున నాతడు మాన

సికమైన బాధ నొందెను. మోతీలాల్ తో సంభాషించు సందర్భమున గాలిబు ఇట్లు వచించెను. "నే నొక దినమైనను త్రాగక గడిపినచో నన్ను కాఫిర్ అనుకొనుము - ఒక రోజున నమాజు చేసినచో మహమ్మదీయుడగాను, అని భావించుకొనుము - ప్రభుత్వము నన్ను విద్రోహులగు మహమ్మదీయులలో ఏల పరిగణించినదో తెలియదు." మతము - మత సిద్ధాంతముల గూర్చి గాలిబు హాస్యచమత్కార పూర్వకముగ విమర్శించెను. గాలిబు తన ఇంటి ప్రవేశ ద్వారము పై భాగమున గల గదిలో దినమంతయు గడిపెడివాడు. దీని కొకవైపు చీకటి గది యొకటి ఉండెను. ఇరుకైన చీకటి త్రోవ-దానిలో ప్రవేశించవలయునన్న తలవంచి రావలయును. ఈ చీకటి గదిలో నొక తివాచీ పరిచియుండెను. వేసవి కాలమున వడగాడ్పులు వీచుచుండ గాలిబు ఉదయము పదినుండి సాయంకాలము నాలుగు గంటలవరకు ఈ గదిలో నుండువాడు - ఒకనాటి సంగతి - రమ్జాన్ పండుగ - మండుటెండలు - ఉపవాసములు పాటించు రోజులవి. ముఫ్తీసదురుద్దీన్ ఆజుర్దా మధ్యాహ్న సమయమున గాలిబు కడకు వచ్చెను. ఆ సమయమున గాలిబు చీకటిగదిలో స్నేహితులతో పాచికలాడుచుండెను. ఆజుర్దా కవి గదిలో ప్రవేశించి అతి పవిత్రమైన రంజాను పండుగ సమయమున పాచికలాడుచున్న గాలిబును చూచి "రంజాను కాలమున సైతాను ఒక గదిలో బంధితుడై యుండునని" వింటిని. కాని ఆసూక్తి నిరర్థకమైనదని ఇపుడు సందేహము కలిగినది అని విమర్శించెను. గాలిబు తక్షణమే సమాధాన మొసగినాడు. "ఆ సూక్తులే మాత్రము కల్లలు కావు. సైతాను నిర్బంధితుడైన మందిర మిదియే"-అని.

మద్యపానము పాపకార్యము కాదని, దానిని ప్రస్తుతించుటయందును, తనను మద్యపాన మొనర్చు పాపిగను చిత్రించుటలో గాలిబు ఏమాత్రము సందేహించలేదు. దానిని రహస్యమని దాచియుంచలేదు. ఎవరో ఈ చర్యను గర్హించ మద్యపానము వల్ల దోషమేమి అని అమాయకముగ ప్రశ్నించినాడు. త్రాగుబోతు చేయు ప్రార్థనలను భగవంతు డాలకించడని మిత్రు డొకడు స్పష్ట మొనర్చెను. మానవుడుమద్యము సేవించిన తర్వాత దేని కొరకు ప్రార్థించుట? అని ఆతని సమాధానము. గాలిబు తన మిత్ర బృందములో ఎవరితో మద్యము సేవించెడివాడో తెలియదు. ఇంటికి వచ్చినవా రెవరికిని మద్య మొసగినట్లు తెలియదు. సాధారణముగ సాయం

కాల సమయమున మిత్రు లాతని ఇంటికి కాలక్షేపము నిమిత్తము, చతుర సంభాషణము వినుటకు వచ్చెడివారు. సురాపాన మొనర్చి కైపెక్కిన స్థితిలో ఆతని చతురోక్తులు సరసములై రక్తి కట్టెడివి. మద్యపానమున కాతడు మితి మీరి అప్పులు చేసెను. అవి తీర్చనపుడు అప్పులిచ్చినవారు కోర్టులో దావా వేసినారు. సదురుద్దీన్ ఆజుర్దా అప్పుడు న్యాయాధికారి. తనపై ఫిర్యాదుకు సమాధానముగ ఈ గేయమును చదివినాడు:

అప్పులు చేసి త్రాగినాను
ఎపుడో ఈ గతి వస్తుందని అనుకున్నాను.

న్యాయాధికారి చిరునవ్వుతో వాది పక్షమున తీర్పు చెప్పి వారు కోరిన ధనమును తానే చెల్లించినాడు.

క్రీ. శ. 18?5 లో అప్పు లిచ్చిన వారు గాలిబుపై దావా వేసి డిక్రీ పొందినారు. ఆ కాలమున గౌరవాస్పదులైన వారిని ఇంటినుండి నిర్బంధించు కొని వెడలుట అనుచితముగా భావించెడి వారు. దినము పూట ఇంటి బయట కన్పించినను, కోర్టువారి కెవరైన తెల్పినను నిర్బంధించెడివారు. ఈ కారణమున గాలిబు దిన మంతయు ఇంటియందే గడిపి రాత్రిపూట మాత్రమే స్నేహితుల కలిసికొనుటకు వెళ్ళుచుండెను. ఇట్టి పరిస్థితి ఎన్ని నాళ్ళు కొనసాగినదో తెలియదు. కొన్ని నేరము లొనర్చిన వారిని, గౌరవా స్పదులైనను, ఇంటియొద్ద నిర్బంధించెడివారు. గాలిబు డబ్బు పెట్టి జూద మాడెడివాడు. ఇది చట్ట ప్రకార మొక విధమైన నేరమే. కొత్వాలు తన విధి నిర్వహణమున అతి జాగరూకత వహించినట్లు నిరూపించదలచుకొనెనో లేక గాలిబు పట్ల అనాదరభావమో! ఆతని నొకనాడు ఇంటియొద్ద జూద మాడుచుండ చూసి నిర్బంధించి తీసికొని వెళ్ళెను. గాలిబు నేర మొనర్చినట్లు కోర్టులో నిరూపించ బడినది. ఆరు నెలల కారాగారవాసము, రెండు వందల రూపాయల నగదు చెల్లింపు శిక్షగా విధించబడినది. జుర్మానా చెల్లించనిచో అదనముగ ఆరు నెలల కారాగారవాసము. ఏబది రూపాయల జుర్మానా అధికముగ చెల్లించిన పక్షములో కారాగారవాస శిక్షను మూడు నెలలు తగ్గించుటకు వీలు కల్పించినారు. ఈ శిక్ష సామాన్య నిర్బంధ శిక్షవంటిది. గాలిబు దాని ననుభవించిన సమయమున స్నేహితులు వచ్చి కలిసికొనుట

కనుమతించినారు. ఇంటి నుండి భోజనము తెప్పించుకొనుట కవకాశము కల్పించిరి. ఢిల్లీ నగరమున ప్రముఖ వ్యక్తిగా కీర్తి ప్రతిష్ఠ లార్జించిన కాలమున గాలిబు ఏబదియవ యేట 1847 లో ఈ శిక్ష ననుభవించెను. బహాదురుషా చక్రవర్తి ఈ సందర్భమున జోక్యము కలిగించుకొని గాలిబు విడుదలకై రెసిడెంటుకు లేఖ కూడా వ్రాసెను. కాని కేసు కోర్టులో విచారణకై యుండ, రెసిడెంటు ఎట్టి చర్యను గైకొనజాల కుండెను. ఈ శిక్షతో గాలిబు మానసికమైన ఆఘాతము నొందెను. తన దర్జాను గూర్చి ఎంతయు తపించెను. తనకు విధించిన శిక్షను గూర్చి, దానికి సంబంధించిన చట్టమును గూర్చి గాలిబు కవి ఒకానొక గజలులో నిశితముగను, దారుణముగను నిట్లు విమర్శించెను :

నే నొక సామాన్య మానవుడ !
ఇట్టి పాపములు చేసినందులకు గర్వితుడ !
ఈ ద్రాక్షాసవ పూజను విస్మరించను
ఎన్ని తుపానులు వచ్చినను ఎదురీదెదను.

గాలిబు తనను గూర్చి అనేక దృక్పథములతో ఆలోచించెను. గురూపదేశముల ననుసరించిన వ్యక్తిగను, జీవన సౌఖ్యమును సంపూర్ణముగ ననుభవించిన వ్యక్తిగను, అస్తిత్వ శిక్ష నొంది నిస్సహాయస్థితిలో నుండిన మానవుడుగను, అవకాశములను కోరికలను వినియోగించుకొనుటకు నోచుకొనని వానిగను గాలిబు భావించుకొనెను. భగవంతుడు ప్రసాదించిన వేల కొలది గుణములలో కొన్నింటినైనను అనుభవించుటకు అవకాశము లభించలేదు. చేతిలో దండమూని, దుప్పటి కప్పుకొని, పాత్ర మెడకు తగిలించుకొని పాదయాత్ర చేయుచు షీరాజు, ఈజిప్టు, నజఫ్ మున్నగు ప్రాంతాలు తిరుగు శారీరక దార్ఢ్యము లేదు. ప్రపంచమున కాతిథ్య మొసగి ఉద్ధరించు శక్తి అంతకును లేదు. ప్రతి మనిషికై బాధ్యత వహించు శక్తి లేకున్నను, నేను నివసించు నగరమున అందరు కూడు గుడ్డలకైనను లోపములేక జీవించవలయునని ఆకాంక్ష !

స్వేచ్ఛగా విహరించు శక్తి గాలిబున కే మాత్రము లేకుండెను. ఇంటిలో హాయిగ కూర్చొని స్నేహితులతో, కబుర్లతో కాలక్షేపము చేయుట

అనిన ఆతని కెంతయు సరదా. తన ఇంటికి వచ్చిన స్నేహితుల ఇండ్లకు గాలిబు తప్పక వెళ్ళెడివాడు. అధిక సమయమును ఇంటియందు లేక వరాండాలో గడుపు చుండెను. గాలిబు శారీరక వ్యాయామము చేయలేదు. రొట్టె, మాంసము వంటి భోజనముతో ఆతని ఆరోగ్యము భంగమై యుండును. అవసానదశలో నాతడు లేఖలలో వివరించి యుండిన అనారోగ్యములకు మూల మిదియే. ఆతని ఔదార్యమును గూర్చి ఎవరి కెట్టి సందేహము లేదు. ఆత నింటికి వచ్చిన భిక్షకు డెవడును రిక్త హస్తాలతో వెళ్ళలేదు. బంధువులకు, స్నేహితులకు శక్తి కొలది సహాయము చేసినాడు. దూరదృష్టి లేని ఔదార్యమే ఆతనికి ఆర్థికమైన బాధలను కలిగించినది.

నేటి సాంఘిక సిద్ధాంతములు కవులకు కవిత్వమునకును, దేశమునకుపయుక్తమైన ప్రయోజనమును విధించినది. ఈ ఆదర్శములు, సిద్ధాంతములు ఉదాత్తమైనవి కావచ్చును కాని అవి కవికి గల స్వేచ్ఛను హరించును. దీనికి భిన్నముగ కవికిని సమాజమునకును ఎట్టి సంబంధమును కల్పించనట్టివి, సంఘములోని వ్యక్తిగా ఆతనికెట్టి బాధ్యతలు లేవని భావించునట్టివి, ఆతని కవిత ఒక కళాఖండమని నిరూపించునట్టివి, అగు కొన్ని నిశిత విమర్శనాత్మకములగు సిద్ధాంతములు కొన్ని కలవు. గాలిబు కవి సమకాలిక రాజకీయ పరిస్థితిని గూర్చి అంతగా పట్టించుకొనలేదు. బ్రిటిషు సామ్రాజ్య స్థాపనము అంగీకార యోగ్యమైన దను భావమాతని వర్తనము వలన తెలియును. ఆతని సమకాలికులలో దేశభక్తు లెందరుండిరని పరీక్షించుట కష్టసాధ్యమని విస్మరించినచో ఈ అంశమును గూర్చి గాలిబును విమర్శించవచ్చు. నాటి సంఘ సంస్కర్తలే ఈస్టిండియా కంపెనీ పాలనా విధానము. దాని స్థిరత్వముపై ఆసక్తి వహించి ఆధారపడుటకు ఆలోచించియుండుట ఇందులకు కారణము. మూఢ విశ్వాసము – దోపిడీ విధానము – అనైతిక అధర్మ జీవనము, సమకాలిక సంస్కరణోద్యమముల గూర్చి అనాసక్తి మొదలగునవి ఖండనార్హములనియు, నిర్మూలింపదగినవి అనియు గాలిబు గుర్తించలేదు. దీనిని గూర్చియు మనము గాలిబు కవిని విమర్శింపవచ్చు. ప్రజల వ్యవహారము నుండి గాలిబు సుదూరముగ నుండెను. క్రీ.శ. 1857 నాటి క్లిష్ట సమయమున, ఢిల్లీ నగరము నందల్లకల్లోల పరిస్థితి ఏర్పడినపుడు, గాలిబు తన ఇంటి యందు నిశ్చింతగా నుండెను. కాని ఆనాటి పరిస్థితుల

వలన గాలిబు పొందిన బాధ ఎట్టిదో ఈగజలు వలన తెలియును. సంకలన కర్తలు-పరిష్కర్తలు గాలిబు పద్య కవితా సంకలనమునం దీ గజలును చేర్చి ప్రకటించనందున దీనిని గూర్చి పాఠకులకు వివరములు తెలియవు. ఈ గజలు 1822 లో రచింపబడిన దని గమనించుట ముఖ్యము. చివరి రెండు భాగములు మాత్రము అనంతర దశలో చేర్చ బడినవి.

గుండెలోని బాధలతో సతమత మయ్యేవారిని
నీ ఈ ఎదలోని బాధల గూర్చి అడిగెద వేల
నీ మదినే ప్రశ్నింపుము.
నీవే ఒక దర్పణమైనపుడు అంతయు సుస్పష్టమగును.

దేశమునకు రాజధాని ఢిల్లీ నగరము
దాని వైభవము వర్ణనాతీతము
తప్పించుకొని వెళ్ళుటకు ప్రయత్నించకు - అది దుఃఖకరం
ఎదలోనే వేడి కలదు - గూటిని రగిలించుటకు
దీపపు వేడితో పురుగులు కాలుట లేదు
వాని ఎదలోనే మంట లున్నవి

పాప పుణ్యాలను త్రాసులో వేసి చూడ నేల
తెలసీ తెలియక చేసిన పాపాలతో పళ్లెం నిండి పోయింది
ఓ దయా హృదయా కరుణింపుము.
ఎదలో ఎప్పటి కప్పుడు ఏర్పడు గాయపుమచ్చ
ఎదగా మారును - దీని బాధ ఎంతని వివరింతు!

ఈ దుఃఖము నెంతని వర్ణింతు, ఇంట పచ్చని గడ్డి మొలిచింది
అదియె వసంతమైన ఆకురాలు కాల మెట్లుండును
ఒంటరి ప్రయాణ మిది - నిరాశలో నేను
వెనుక బడిన వారికై తపింతు.

బ్రిటిషువారు ఢిల్లీ నగరమును మరల ఆక్రమించుకొనిన అనంతరము, నిర్దాక్షిణ్యముగను, క్రూరముగను హింసలకు గురియైన అమాయకులగు తన

స్నేహితుల గూర్చి గాలిబు ఎంతయో విచారించెను. ప్రజాసామ్య, జాతీయ దృష్టితో జూచిన, గాలిబు కేవలము వినాదము లొనర్చు పౌరునిగ నుండుట కుత్సహించలేదని తెలియును. స్నేహితుల కాతడు సన్నిహితుడుగ నుండుటలో తృప్తివహించెను. ఆదము సృష్టిలో ప్రతివ్యక్తిని - అతడు హిందువు - మహమ్మదీయుడు, క్రైస్తవుడు - ఎవరైనను ప్రేమించి సోదరునిగ అభిమాన గౌరవములతో చూచెదనని గాలిబు ఒకానొక లేఖలో స్పష్ట మొనర్చెను. అన్యులీ అంశమును నమ్మినను నమ్మకపోయినను, నేనేమాత్రము లక్ష్య పెట్టనని అతడు వచించెను. వ్యక్తిగత స్నేహబాంధవ్య దృష్టితోనే కాని సమాజోద్ధరణ దృష్టితో గాలిబు వారినిగూర్చి ఆలోచించలేదు. స్నేహమున కధిక ప్రాధాన్యము నొసగి వారి కోరికల మన్నించుటలో ఆసక్తిని వ్యక్తీకరించెను. గాలిబు తన లేఖలలో ముఖ్యమైన సమస్యల గూర్చికాని, తత్త్వములను గూర్చికాని చర్చించలేదు. వివిధ విశ్వాసములు - అభిప్రాయములతో పాలుపంచుకొనుట అతని స్నేహధర్మము కాదు. అది ఒకవిధమైన ఆత్మబంధము. ప్రజా సమూహమును సమ్మోహితము చేయుదానికంటె సుశిక్షితమైనది.

గాలిబు ఎన్నియో సందర్భములందు తన మరణకాలమును గూర్చి జ్యోస్యము చెప్పియుండెను. క్రీ. శ. 1867 లో ఒక లేఖయం దిట్లు వివరించెను:

''నా కిపుడు మృత్యువాసన్నమైనది - భోజనమునం దరుచి కలిగినది. రోగములు శరీరము నాక్రమించినవి-ఇపుడు డెబ్బది మూడవ సంవత్సరము- భగవంతుని నుండి వచ్చితిమి - మరల ఆతని యొద్దకే వెళ్లుదుము - పీర్ షరీఫ్ అనగా వయోవృద్ధు డను పదమునకు - డెబ్బది - డెబ్బది ఒకటవ వాడు అను అర్థము కలదు. నా కిపుడు డెబ్బది మూడేండ్లు. కనుక ఇంకను అశక్తుడను - జ్ఞాపకశక్తి సన్నగిలినది. ఒకనాడు అది ఉండెనా అను సందేహము కూడ కలుగును, చెవులు వినపడవు. జ్ఞాపకశక్తివలె చూపుకూడ మందగించినది. దాదాపు నెల రోజులనుండి నన్ను జూచుటకు వచ్చిన స్నేహితులు నా క్షేమ సమాచారముకంటె అన్యమైన విషయములను తెలిసికొనవలయు నన్న కాగితముపై వ్రాసి చూపుచున్నారు. నామ మాత్రపు భోజనముతో కాలము గడచుచున్నది. ప్రొద్దున ఇసుమంత బాదాం పలుకు నూరి కలిపిన

షరబత్తు - కలకండ; మధ్యాహ్నము సామాన్య భోజనము, సాయంకాలము నాలుగు వేపుడు కబాబు ముక్కలు - నిదురపోవుటకు ముందు అయిదు తులాల గులాబి పన్నీరు కలిపిన సారాయి. నేను జీర్ణాంగుడ - పాపాత్ముడ- దుష్టకర్ముడ - అకార్యములతో నేను తలవంచుకొనినాను - 1867 మరణ సంవత్సరము అని సూచించి వ్రాసిన పద్యము వ్యర్థప్రయత్నము - గాలిబు మహాకవి క్రి. శ. 1869 సంవత్సరము 16 ఫిబ్రవరివరకు జీవించెను.

# గాలిబు - కవితా సంప్రదాయము

గాలిబు ప్రాతినిధ్యము వహించే కవితా సంప్రదాయము ప్రశస్త సాహిత్యమునకు సంస్కృతికి సంబంధించినది. జీవిత అస్తిత్వమునకును, మానవ ప్రకృతికిని గల ప్రగాఢ సంబంధము నది శక్తిమంతముగ వ్యక్తీకరించును. తాత్త్విక, సూఫీ సౌందర్యతత్త్వ భూయిష్ఠమైనది. అంతియేకాక కొంతవఱకు స్వల్పాతి స్వల్పములును క్షణభంగురములును అగు అంశములతో సమ్మేళనము నొందినట్టిది. ఈదృష్టి మానవుని పరిధిలోనే జరిగినది. తత్త్వము - సూఫీతత్త్వము - సౌందర్యమునందే కాని మతసిద్ధాంతమునందు కాదు. ఈ కారణమున ఇట్టి కవిత మానవుని ఆత్మావిష్కారమునకు, తత్త్వనిరూపణకు సాధనమై యుండెను. అది వ్యక్తికి సుదూరముగనుండి సాంఘిక ప్రయోజనములను ఆదర్శములను నిర్లక్ష్య మొనర్చినది.

జీవిత దృక్పథమునకు ప్రాధాన్యము నొసగిన ఈ కవిత ఒక విశిష్ట రూపముగ అరబు దేశములకంటె ఇతరమైన మహమ్మదీయ ప్రపంచమున అవిర్భవించినది. ఇది పారశీకుల ప్రతిభాజన్యమని భావింపవచ్చును. పశ్చిమమున తుర్కీ దేశీయులు, తూర్పుమండలమున భారతీయ ముస్లిములు దీనిచే ప్రభావితులైరి. దీని ఆవిర్భావమున కనేక మూలములను జూపవచ్చును.

1. ఇస్లాము బోధనల ననుసరించి లౌకిక పారలౌకిక జీవితమునకు పునాదిగ మానవ స్వభావము నంగీకరించుట.

2. మత జీవితమున కంకితమైన ప్రత్యేక సంస్థ లేక చర్చి మధ్య వర్తిత్వము లేక మానవునకును పరమాత్మునకును ప్రత్యక్ష సంబంధమును నెలకొలుపుట.

3. మతదృష్టికి, న్యాయతత్త్వ సంబంధమైన అనివార్యమగు సంఘర్షణ.

4. మానవునకుగల సౌందర్యదృష్టి.

5. బౌద్ధికముగా సుకుమారులైన వారిని సుముఖులుగ నొనర్పజాలు సాంఘిక రాజకీయ వ్యవస్థను రూపొందించుటలో అశక్తత.

ఒకానొక కాలమునందలి ప్రచురితముగానున్న మత విశ్వాస విధాన మెట్లున్నను మానవ స్వభావము తన అస్తిత్వమును నిరూపించుకొనును. కాని చారిత్రక దృష్టితో పరిశీలన మొనర్చినచో కవిత్వము లలితకళలు మున్నగునవి మానవునికి కేంద్రీకృతమైనపుడు మాత్రమే వికాసము నొందినట్లు స్పష్టమగును...ప్రాచీన కాలమున గ్రీసు రోము దేశములందు, పునరుజ్జీవన కాలములందును, తదనంతర శతాబ్దులలోను, కవిత్వము లలితకళలు అధిక ప్రాచుర్యమునొందినవి. మహమ్మదీయులలో మతము మానవ పరిధికి మాత్రమే కేంద్రీకృతమైనను, ధర్మశాస్త్రజ్ఞులు సమకాలిక సాంఘికాభిప్రాయములను వ్యక్తీకరించు కళల వికాసము నదుపులో నుంచుటయందు విజయమును సాధించిరి. ఇస్లాము తత్త్వము, దానిని విభిన్న దృక్పథములతో పరిశీలించిన విధానము మొదలగువానిపై ఆధారపడిన దృష్టి, స్త్రీలను దూరముగ నుంచు పద్ధతి, ఎన్నియోవిధముల అభ్యంతరములను కలిగించినది. కవిత్వము – శిల్పము అను రెండు విశిష్ట కళల యందే మహమ్మదీయులు తమ సౌందర్య దృష్టిని స్వేచ్ఛగా వ్యక్తీకరించుట కవకాశము నొందియుండిరి. ప్రజలకు కవిత్వమే ఇట్టి అవకాశమును కలిగించినది. ఇస్లాము మతము, మానవ పరిధికి కేంద్రీకృతమై స్పష్టముగను, శక్తిమంతముగను నిర్వహించిన పాత్ర సంప్రదాయ కవితలో దర్శింపనగును. సూఫీలు తమ ఆధ్యాత్మికానుభవములను పురస్కరించుకొని మత సిద్ధాంతములను యథాతథముగ నంగీకరించుటకు, మార్చుటకు, తిరస్కరించుటకు తమకు స్వేచ్ఛ యుండవలయునని భావించిరి. ఆ చరిత్రయే వేరు. ఇది మహమ్మదీయ మత ధర్మ శాస్త్రములకు, చట్టమునకు, స్పష్టతను, సంపూర్ణతను కలిగించుటకు

ధర్మసూత్రకారు లొనర్చిన ప్రయత్నము. తొమ్మిదవ శతాబ్దిలో కొన్ని నైతిక సిద్ధాంతములను శాస్త్రకారు లాక్షేపించుట, నీతిశాస్త్రజ్ఞులకును, రాజ్యమును సమర్థించు వారికిని కలిగిన సంధి ఫలితముగ వారికి కలిగిన పరాజయము, నిరంకుశపాలనముయొక్క హింసాత్మక చర్యలు, నైతిక రాజకీయ విధానములు, వ్యక్తి స్వతంత్రముగ నాలోచించి నిర్ణయించుకొనుటకు గల స్వేచ్ఛను నిరాకరించుట – మొదలగునవియును, అంతకంటెను పరతత్త్వమునుగూర్చి ఆధ్యాత్మిక వాదుల అన్వేషణాసక్తి మొదలగువాని పరిణామము లని భావింపవచ్చును. సూఫీలు మొదట అనుమానములకు, హింసలకు గురియైనారు కాని వారు క్రమముగ ప్రజలలో ప్రచార మొనర్చి నిలువ గలిగినారు. పన్నెండవ శతాబ్దినుండి సూఫీ విధానము, సంప్రదాయబద్ధమైన శాస్త్రము, అను రెండు మార్గము లేర్పడినవి. అవి మహమ్మదీయులకు అనుసరణీయము లైనను కొందరికి వారి ఇష్టము ననుసరించి ఎప్పుడైనను ఒక పద్ధతినుండి ఇంకొక దానికి మారు స్వేచ్ఛయుండెను.

ధర్మశాస్త్రమునకు ప్రభుత్వముయొక్క అండదండ లుండెను – మహమ్మదీయ ధర్మశాస్త్ర పరిధిలో ఒక విశిష్ట సంస్థను స్థాపించుటలో షరియా ప్రతినిధులు, అధికారవర్గమునకు చెందిన పండితులు, తమ నైతిక స్థితిని తామే తగ్గింపజేసికొనినారు – మహమ్మదీయ ప్రభుత్వమునకు విధేయులుగ నుండుట కాదేశించినారు. ప్రభువులను ప్రజల క్షేమమును కాపాడుమని కోరినారు. కాని ఎవరినికూడ పరస్పర మిస్లాము నైతిక సూత్రములను పాటించి సహకారము నొసగవలయునని అర్థించలేదు. ప్రజలు పాలకులు నైతిక సూత్రముల కైక్యము కూర్చుటలో విఫలు లైనందున సంస్కారము గల వ్యక్తి తనకుతానై జీవించుటకు, తన ప్రపంచమును తాను నిర్మించుకొనుటకు, సంఘమును నిర్లక్ష్య మొనర్చుటకు పూనుకొనవలసిన స్థితి యేర్పడినది.

పరతత్త్వ కవితా సంప్రదాయముకూడ, మత విశ్వాసపరుడగు మానవుని, సామాన్య మతభేదముల కతీతముగ నుండవలయునని నిర్దేశించినది. తత్త్వరూపమున ఇది ఒక విధమైన అద్వైత సిద్ధాంతమున కనిపించును. ఈ సిద్ధాంతములందు విశ్వాసము కలవారికి సంప్రదాయ వాదులకును, పరస్పరము నిరంతర సంఘర్షణ మేర్పడినట్లు స్పష్టమగును. కవి భగవంతుడు

మరియు ప్రవక్తను గూర్చి గౌరవభావము వహించెను. అతడు షియా శాఖీయుడైనచో 'ఇమాము'లను కూడ పూజించవలసి యుండెను. మీర్ అనీస్, దబీరు మున్నగు కవులు ఇమామ్ హుసేనుల అమర గాథలను గూర్చి అధిక ముగ మర్సియాలను, తక్కినవానిని గూర్చి స్వల్పముగను వ్రాసి యుండిరి. సౌందర్య దృష్టిపై ఆసక్తి వహించి మతమును నిర్లక్ష్య మొనర్చు దృష్టి అసలే కనిపించదు. బాహ్య ఆచారములను మన్నించి సౌందర్య దృష్టిని విస్మరించుట మతసంప్రదాయములను తిరస్కరించుట కవి సౌందర్య దృష్టి ఔన్నత్యమునకు ప్రధాన గుణముగా భావింపబడెను.

విశిష్టమైన పారశీక కవితా సంప్రదాయమునకు ప్రాతినిధ్యము వహించిన ఉర్దూ కవిత, చారిత్రకమైన పరిస్థితులు సాంఘిక ధర్మములు, ఆచార నిర్బంధములు, సంప్రదాయ విశ్వాసములు మున్నగువానిచే దూర మైన వారి నొకచో చేర్చి అత్యున్నతమైన స్థాయిలో ఐక్యతను సంభావించు టకు ప్రోత్సహించినది. భారతదేశము సాంస్కృతిక చరిత్రలో ప్రాముఖ్యము గల ఆలోచనాత్మక, సౌందర్యాత్మక, ఆదర్శపూర్వకమైన సమైక్యతా వికాసమునకు గాలిబును ప్రధాన కేంద్రముగా భావింపవచ్చును.

కవితా సంప్రదాయము, తన స్వభావము, చరిత్ర ననుసరించి తన ప్రతీకలను తానే రూపొందించుకొనినది. ఇందు అత్యంత ప్రధానమైనది, పునాదివంటిది ప్రణయము – దీని పరిధి విశ్వవ్యాప్తమైనది. ఉదాత్తమైన, లౌకికమైన ప్రణయముల సమ్మేళనముల పారశీక కవితలో ప్రధాన లక్ష ణము. ఇందు ప్రతీక లనంతములు – కటకటాలనుండి కాంతిని దర్శించినట్లు లౌకిక శృంగారము మూలమున పరమాత్ముని చూడనగును. మానవుని రూపమున పరమాత్ముని జ్యోతిని లౌకికము, పవిత్ర ప్రణయ రూపమున దర్శింపవచ్చును.

భగవంతునివలె ప్రేమ సారవంతమైనది. అది సంపూర్ణ విశ్వాస మును విధేయతను కోరును. దానికి సృష్టి లయ శక్తులు - న్యాయ నిర్ణయ దమనశక్తులు, ఆగ్రహానుగ్రహములు - కలవు. దాని పరీక్షకు నిలిచినవారికి అపూర్వమైన సుఖములు ప్రతిఫలముగ లభించును. దాని రూపము లనంత ములు - సముపార్జించిన విద్యల కెట్టి విలువ నొసగక అది జ్ఞానోదయము నకు ప్రేరణ కలిగించును. బాహ్యములైన వివిధ విశ్వాసరూపములు,

అసంగతములైన కోరికల నిర్బంధములు - శిక్ష ప్రతిఫలములు - స్వర్గనరకములు మున్నగువానినుండి ఆత్మను రక్షించును. అది ఒక వ్యక్తిని గూర్చిన అనురాగ రూపము నొంది పారవశ్య, ఆత్మార్పణము మున్నగు రూపములందును వ్యక్తము కావచ్చు. పవిత్ర లౌకిక ప్రేమలు రెండును కలిసిపోయి ఒకే రూపమున భాసింపవచ్చు. మానవ రూపమున గల ప్రేయసి పరతత్త్వ రూపమున ఆవిష్కారము నొందవచ్చు - చివరి దశలో ప్రణయము ప్రియుని ధర్మముగా హృదయమున స్వయముగ చెలరేగు తాపముగ, లక్ష్యముగను, లక్షణముగను భాసిల్లి ప్రియుని పరమాత్మునిగ మార్చవచ్చు.

ఈ విధముగ ప్రణయమును వ్యక్తీకరించుటకు కవిని, ప్రియుని సాధనముగ నొనర్చును. తనను తాను తెలిసికొను తపనము ప్రణయమునకు వశమైన ధర్మముగా వ్యక్తమగును. ఆతనికి ప్రేయసి యొక్క ప్రతీకతో అవసరము కావచ్చు కాకపోవచ్చు. పారశీక, ఉర్దూ కవితలో ప్రియుని కల్పనము రెండు మూల రూపములలో కనిపించును. అరబీలో మజ్నూ, పారశీకమున ఫరహాదు ఇట్టివారు. మజ్నూ ఎడారిలో పరిభ్రమించుట, లైలాకై విరహము నొంది ప్రాణములు వీడుట అను కల్పన మిట్టిది. సాహసముగ ప్రయత్నించు ప్రియునకు ఫరహాదు లక్ష్యముగ చిత్రింప బడినాడు. అతడు తన ప్రేయసి షిరీన్‌కై చేగొడ్డలితో పర్వత పాషాణములను బ్రద్ద లొనర్చును. మజ్నూను గూర్చి, ఆతని భాగ్యమును గూర్చి లైలా నిర్లక్ష్యముగా నుండును. ఫరహాద్ అశక్యమైన కార్యమును సాధించినపుడే షిరీన్ ఆతనికి వశమగును. ఇట్టి కఠిన పరీక్షకు నియోగించిన ప్రభువు, ఫరహాద్ అట్టి కార్యమును నిర్వహించినను, ప్రతిఫలము నొసగుటలో మోసగించుటకు ఎత్తు వేసెను. కాని మజ్నూ, ఫరహాదులు కేవలము ప్రతీకప్రాయులు. కవులు వారికి సంబంధించిన ప్రణయమును తమకు తోచిన రీతిలో వ్యాఖ్యానించుటకు స్వేచ్ఛ వహించిరి. అంతియకాని సందర్భము ననుసరించి సరియైన చారిత్రక రూపమున చిత్రించ లేదు.

గాలిబు ఒక సందర్భమునం దిట్లు వచించెను :

బాల్యమున మజ్నూపై చిన్న రాతిని
విసరా లని చేపట్టినాను

అపుడే తోచింది
నాకును నొక 'తల' ఉన్నదని

ప్రేయమునకు అసాధారణ రీతిలో వర్తించు వ్యక్తికి మజ్నూ నామము పర్యాయపద మైనది.

స్వరూప స్వభావము నందును ప్రియురాలి కల్పనము నానావిధము లుగ నొనర్చబడినది. అది కవి ఊహల ననుసరించి మార్పుల నొందెడిది. ఈ సందర్భము లందును పవిత్ర, లౌకిక, ప్రణయము ఒక దానిలో నొకటి కలసిపోవును. ప్రేయసి నొకసారి ప్రేమ స్వరూపిణి యగు స్త్రీగను, ఆధ్యాత్మిక గురువుగను, పరమాత్మునిగ భావించిన కవిని అట్లొనర్చుటకు గల కారణము నడిగినచో అది తన తప్పు కాదనియు, ప్రేయసినే అన్ని రూపములలో సాక్షాత్కరించిన దనియు సమాధానము నొసగవచ్చు. ఖుస్రో కవి ఒకనాడు తన గురువు, షేక్ నిజాముద్దీన్‌ను దర్శించినాడు. వారి కనులు నిదురలేమి ఎర్రబడి యుండెను. గురువుగారు రాత్రి అంతయు ప్రార్థనలతో గడిపియుండునని ఖుస్రో కవికి తెలియును. కాని కవితా దృష్టితో ఈర్ష్యా సూయలు గల ప్రేయసి ప్రియుని జూచి అనుమానించి అడిగినట్లు ఖుస్రో కవి భావించెను. "నీవు రాత్రి ఎవరి పరిష్వంగమున నుంటివి అని ప్రశ్నించును. సూఫీ కవి సర్మదు, మరణశిక్ష నొందినపుడు కత్తిని చేబూని వచ్చుచున్న తలారిని చూచి చిరునవ్వుతో ఇట్లనెను:"రమ్ము-రమ్ము-నీవు ఏ రూపమున దర్శన మొసగినను నిన్ను తప్పక గుర్తించెదను.''

గాలిబు మరియొక సందర్భమునం దిట్లనెను :

**తలారి జూచి నేను భయపడను**
**మత గురువుతో పోరాడను**
**ఏ వేషము వేసినా**
**వారివి నే గుర్తిస్తా—**

దీనికి భిన్నంగా నజీరికవి ఇట్లనును :

ఆపాదమస్తకం నేను నిన్ను చూచినా ఏదో అద్భుతశక్తి
నన్నాకర్షించి అంటుంది
''ఇదిగో చూడు నే నిక్కడ నున్నా''నని.

ఈ సందర్భమున కవి కేవలము ఒకా నొక వ్యక్తి నుద్దేశించియే మాట్లాడెను. అంతకు మించిన దేమియు లేదు.

లౌకిక రూప కల్పనము నుండి ఆధ్యాత్మిక స్థితికి మారిన దానికి తార్కాణముగ అజ్ఞాత కవి కృతమగు ఈ పద్యభాగము నుదాహరింప వచ్చును.

గత రాత్రి స్వేచ్ఛగా విహరించు ఆకార మొకటి
నా గుండె చుట్టు మెలివేసి క్షణములో మాయమైనది
ఒక కాంతి - పరమాత్మని దివ్య తేజమును బోలినట్టిది
నా ఎదలో మెఱుపు తీగవలె ప్రకాశించి ఆరిపోయింది.

నిగూఢ వాదులు హృదయమును ప్రాతిపదిక యగు ప్రతీకగా గ్రహించిరి. ఆత్మ తత్త్వానుభవములు, ఆధ్యాత్మికానుభవములు హృదయానుభూతికి సంబంధించినవి కనుక కవులు హృదయమును ప్రతీకగ నానార్థములలో గ్రహించుట సహజమే. అది ప్రణయమునకు ప్రధాన స్థానము. ఆత్మశక్తికి మూలభూతము. నిగూఢ తత్త్వములో నిగూఢమైనది. సర్వ దుఃఖములకు మూలకారణము-మానవ ప్రకృతిలో చైతన్యము గల అంశము-సృష్టి, స్థితి, లయము, మార్పు మున్నగువాని నొనర్చు శక్తి గలది.

మద్యపానము పరిహరింపదగినది అని మహమ్మదీయుల కుపదేశింపబడెను. ప్రజాభిప్రాయము-నైతిక విలువలు, అనేక శతాబ్దములనుండి దీని కొక ప్రత్యేక గుణముగ సంభావించినవి. అది పరిహరింపదగినది అని కొందరి అభిప్రాయము ఇట్టి నిషేధమున్నను మద్యపాన మొనర్చువారు పాపాత్ములా? అను అంశ మిట చర్చింపదగినది కాదు. మద్యపానమును గూర్చి విపరీతముగ భావించినవారిని కవులు కుటిలాత్ములుగ నెన్నినారు. గోష్ఠిలో సమావిష్టులైన వారికి మద్యము నొసగు సాఖి, మద్యము, పానశాల

మొదలగునవి పారశీకకవితలో ప్రతీకలుగ గ్రహించబడినవి. ఇవి యథాతథముగ ఉర్దూ కవితలో ప్రవేశించినవి. మసీదు - పానశాల - రెండు విభిన్న మార్గములకు ప్రాతినిధ్యము వహించబడినట్లు వర్ణింపబడినది. కాబా - దేవాలయము - షేక్ (ఇక్కడ సూఫీ తత్త్వము ననుసరించిన షేకు కాదు - పండితుడు ఆచారపరుడు: దేశికుడు అనువాడు మాత్రమే.) మరియు బ్రాహ్మణుడు మొదలగునవి అన్నియు పరస్పర విభిన్న ధర్మములకు ప్రతీకలే -

మరణ శిక్షలు, ఘోరమృత్యువులు, మొదలగునవి కవుల హృదయమును, జనసామాన్యము నాకర్షించినవి. మన్సూరుహల్లజ్ అను సూఫీ "నేనే సత్యమును. నేనే పరమాత్మను" అని ప్రకటించుటవలన ఉరిశిక్ష పాలయ్యెను. 'దార్' 'హల్దారు' అనునవి నిర్భయముగా చాటు సత్యమునకు, మానవుడాశించు వానికి ప్రతీకలైనవి. కత్తి - విల్లు అమ్ములు. గంధ్రగొడ్డలి కవి కల్పనలలో ప్రవేశించినవి. అవి ఒక్కొక్కసారి అనుచితములని మనకు తోచవచ్చును. కాని గాలిబు కాలములోను వీని ప్రసక్తి అసందర్భమైనట్టిది అని గ్రహించవచ్చు. తలారి అను పదము ప్రేయసికి ప్రతీక. కాని అది కాఫిర్ అను పదమువలె ఇంపైన ప్రయోగముగ గ్రహింపబడినది.

గాలిబు ఇట్టి కవితా సంప్రదాయమును - ప్రతీకలను కల్పనలు - కవి సమయములను, విద్యలో నొక భాగముగ గ్రహించెను. వీనినుండి దృష్టి మరలించుట కాతడు ప్రయత్నించలేదు. ఈ కారణముచే నాతడు తన వ్యక్తిత్వమును కోల్పోయి ప్రతిభాహీను డయ్యెనా? - సమకాలిక ఉర్దూ కవితలో నూత్న ప్రక్రియల ప్రయోగము సాహిత్యమునకు పుష్టి చేకూర్చిన దనుట కెట్టి సందేహము లేదు. కాని గాలిబునాటి గజలుపై కొందరికి అసక్తి అధికముగా నుండెను. పరిపుష్టి, అనుభూతిలో కాకున్నను వస్తువును వివిధ రూపములలో రంగరించినారు. ఆధునికులు కొందరు మొదట గజలు రూపమునకు వ్యతిరేకముగ తిరుగుబాటొనర్చినారు. పూర్వప్రక్రియను నూత్నదృష్టిలో గ్రహించుటకుగల కారణములు పరిశీలించినచో గాలిబు పరంపరగా వచ్చు పద్ధతుల ననుసరించుచు తన వ్యక్తిత్వము నెట్లు నిలుపుకొన గలిగెనో ప్రతిభను చాట గలగెనో, తెలిసికొనుటకు తోడ్పడును.

గజలులో సాధారణముగ సమానమాత్రలుగల ద్విపద లుండును. రెండవ పాదము చివర ఒక విధమైన నియమము పాటింపబడును - గజ

ులలో ద్విపదల సంఖ్య హెచ్చుతగ్గుగా నుండవచ్చు. రెండు పాదముల భాగము నొక ముక్తకమువలె రూపొందించుట సంప్రదాయము - ఎనిమిది ద్విపదలు గల గజలులో ఎనిమిది విధములైన భావములను వ్యక్తీకరించ వచ్చును. భావమును శక్తిమంతముగ నొనర్చుట ప్రధాన గుణముగను లక్ష్యముగను నెంచబడెను - గజలు ప్రక్రియలోని లక్షణము, పాదాంత ప్రాసనియతికై ప్రత్యేక పదముల అన్వేషణము - మొదలగునవి కవి భావా వేశ ప్రకటనకు నిర్బంధములు కూర్చునట్టివి అని కొందరి అభిప్రాయము - మఱియొక లోప మేమన - భావమున కనుగుణముగ పాదముల మలచు కొనక, చట్రములో భావములను బిగించుటకు ప్రయత్నించుట - ఈ రెండు ఆక్షేపణలు సరియైనవే కాని విశిష్టమైన గజలు మాత్రము లయ ప్రధానమై భాషా సౌందర్యమున రాణించును - అది సూటిగ హృదయమున హత్తు కొనును. దాని ప్రభావము నెవరును తప్పించుకొన లేరు - దాని ప్రాచుర్య మును గూర్చి మాత్రమే విమర్శకులు గర్హించినారు. విమర్శకుల ఆక్షేపణ లిట్లున్నను గజలు ప్రక్రియమాత్రము ప్రతిభావంతులైన కవులను సిద్ధహస్తు లుగ నొనర్చినది.

# గాలిబు కవి

గాలిబు, తాను కవిత్వ రచన కెపుడుద్యమించెనను అంశముగూర్చి విభి న్నాభిప్రాయములను వ్యక్తీకరించెను. పదేండ్ల వయసునాటికి - పదు నైదవ యేండ్లనాటికి అని - అతని విద్యాభ్యాసము క్రమపద్ధతిలో జరుగ లేదు. సాహిత్యమున సముచిత స్థానము నొందిన కొంతకాలమునకు ముందే, గాలిబు కవిత నల్లుట కారంభించియుండును. ధర్మము - నీతి నియ మము లేని విశృంఖల స్వేచ్ఛాజీవనమున కలవడిన నాటినుండియే అతడు పద్య రచనకు పూనుకొనెను. అప్పటి కాతడు వివాహితుడై గృహస్థ జీవి తమున నుండెను. వ్యసనమునకులోనై కవిత చెప్పు రసికులకు కవులతో తిరిగే అర్హత - అవకాశము గాలిబు కవికి అపుడే కలిగినది. మొదట ప్రయత్నము విఫలమైనను నిరాశనొందక, అన్యులను లక్ష్యపెట్టక పద్యరచన క్లేశమును సహించి, ఆత్మవిశ్వాసముతో కవిత చెప్పుట కాతని నెవరైనను ధైర్యము

నొసగి ప్రోత్సహించి యుండురా ? అనునది స్పష్టముగ తెలియదు. తొలి దశలో వెలువడిన రచనల పౌర్వాపర్యములను గూర్చి విశేషాంశములు తెలియవు కనుక కవిగా అతని క్రమవికాసమునుగూర్చి గ్రహించుట కవకాశములేదు. సాధారణముగ కవులు రచించిన గజళ్ళు పాదాంత ప్రాస నియమముల ననుసరించి అక్షర క్రమమున సంకలిత మొనర్చుట పరిపాటి. ఈ కారణమున మొదట వ్రాసిన గజళ్ళు తరువాతి సంపుటములలో చేరుట సంభవమే. నేడు బహుళ ప్రచారము నొందిన భూపాలు ప్రతిని గాలిబు కవి తన కృతుల మొదటి సంపుటముగ స్వయముగ సంతరించి ప్రకటించి యుండెను. దీనిలో నాతడు చేర్చని గజల్లు కాలగర్భమున కలిసినట్లే భావింపవచ్చును.

క్రీ. శ. 1822 వఱకు అనగా ఇరువది యైదేండ్ల వయసు నాటికి గాలిబు కవి పద్య రచన మొనర్చెను. తదనంతరము తన కెంతయు నభిమానాస్పదమైనట్టిదియును, ఉర్దూలో కంటె భావమును సుస్పష్టముగను శక్తిమంతముగను వ్యక్తీకరించుటకు వీలుకలది అనునట్టిదియును అగు పారశీక భాషలో వ్రాయుట కారంభించెను. ఈకాలము నాటికి గాలిబు పారశీక సాహిత్యము నందలి విశిష్ట రచనలను క్షుణ్ణముగ నధ్యయన మొనర్చెను. పారశీక భాషా సాహిత్యములలో తనకు గలిగిన పాండిత్యమునకు ఒకానొక ఈరానీ పండితుడు గురువుగా నుండెననియు నాతడు ఆగ్రాలో గల తన ఇంట రెండేండ్లవఱకు తనకు పారశీక భాషను నేర్పెననియు వివరించి మరల ఖండించుట చిత్రముగా నున్నది. గాలిబు కవి పారశీకములోనే రచనలు గావించిన దశ దాదాపు 1850 వరకు కొనసాగినది. ఆతడు దర్బారు ప్రవేశము నొంది దర్బారున కాహ్వానితుడైన కాలమునుండి దర్బారు భాషయగు ఉర్దూలో వ్రాయవలసి వచ్చినది. అయినను పారశీకమును మాత్రము వదల లేదు. ఆ తరువాతి ఏడేండ్లకాలము అతని ఉర్దూ కవితలోని పరిణత దశగా పరిగణింపబడుచున్నది. క్రీ. శ. 1850 నుండి ఆరంభమైన గాలిబు ఉర్దూ కవితలోని ప్రారంభ దశ, తదనంతర దశయందును కొన్ని సామాన్య లక్షణములు కలవు. అనంతర దశలోని కవితలో గేయ ధర్మములు ప్రస్ఫుటముగ గోచరించును. గాలిబు కొన్ని భావములను రేఖాప్రాయముగ చిత్రించి సంపూర్ణ భావ చిత్రమును శ్రోత లేదా పాఠకుని ఊహకు వదలు పద్ధతిని చివరిదశ వరకును పాటించెను. రెండవదశలో వ్రాసిన రచనల

లోని భాష, భావము సుబోధ మనిపించును. కాని వానిలోని గంభీరమైన అర్థమును గూరి విమర్శకులు సందేహించుచున్నారు. గాలిబు తన వ్యక్తిత్వమును' పొండిత్రీగరిమను విస్మరించలేదు. కాని దర్బారులో పేరొందిన కవిగను, సామాన్యకవి శ్రేణిలో స్థానము నలంకరించి యుండెను. అతడు తన ప్రతిభను, కొంతవఱకు త్యాగముచేసి, సమకాలిక అభిరుచుల కనుగుణమైన రచనా విధానము ననుసరించినను అది ఉర్దూ కవిత్వాభిమానులను విశేషముగ నానందింపజేసినది. సుదూరమునుండి మంచుతో కప్పబడి ప్రకాశించు పర్వత శిఖరమువలె అతడేమాత్రము తోచలేదు. పర్వతపు భాగములు, లోయలు, అరణ్యములు, పవనములు - నిరర్థకముగ ప్రవహించు మంచు నీరు, మొదలగునవి స్పష్టముగ గోచరించినవి. గాలిబు ఇతర కవుల ప్రభావమును - ప్రత్యేకముగ అతని సమకాలికుల గౌరవాభిమానములకు పాత్రులైన కవుల ప్రభావమును - పొందుట సహజమే. అతడు చిత్తశుద్ధి తోడను, హృదయపూర్వకముగను బేదిల్ కవిని తన గురువుగా సంభావించెను.

ప్రగాఢమైన ప్రశంసలకు పాత్రు డాతడు
అతని ప్రతిభ - వైశిష్ట్యము వర్ణనాతీతము
సామాన్య బిందువు విశాల సముద్ర
గాంభీర్యము నెట్లు వర్ణింపజాలును.

బేదిల్ కవి పారశీకమున రచన లొనర్చెను. అతని శైలి జటిలమైనది. గాలిబు కవి తొలిదశలో ఇట్టి రచన లొనర్చుటకు ప్రయత్నించినట్లు స్పష్టము. ఒకానొక విమర్శకుడు గాలిబుపై ఇతర ఉర్దూ పారశీక కవుల ప్రభావమును నిరూపించుటకెన్నియో ఉదాహరణములను చూపెను. ఛందస్సు మొదలగు నియమములను ముందే ప్రకటించే కవి సమ్మేళనముల నేర్పాటు చేయుటవలన ఒక విధమైన సామ్యధర్మ మేర్పడి శ్రోతలు కవి శక్తిని పరీక్షించే పండితులగుట కవకాశము లభించినది - కవులను గూర్చి వారి విమర్శలు - ప్రశంసలు - బహిరంగముగను, చిత్తశుద్ధితోడను లేక ప్రశాంత మౌనరూపముతోడను వ్యక్తమయ్యెడివి. కవు లొకరిని మించి పోవుట కీ విధానము ప్రోత్సహించినది. కాని అప్పుడు ప్రచలితముగానున్న అభిరుచియే కవితా ప్రశస్తిని నిరూపించుటకు తోడ్పడెడిది. ముందే నిర్ణయించిన

అంత్య ప్రాసాది నియమముల ననుసరించి చెప్పిన గజళ్ళలో కవి సహజ కవిత్వ రచన మొనర్చి తన ప్రతిభా పాండిత్యముల నెంతవరకు దర్శింప జేసెడివాడు - అను సందేహము కలుగక తప్పదు. కవి కేవలము గణములు ప్రాసల కూర్చి హృద్యమైన శైలిలో మాత్రమే రచించెనో, వ్యక్తిత్వమును దర్శింపజేయుచుండెనో, సహృదయములు స్పష్టముగ గుర్తించెడివారు.

సంప్రదాయ పూర్వకమైన విమర్శనము, కవి సహజముగ భావావేశమున చెప్పిన కవితకు, అతడు నిర్బంధ పరిస్థితులలో రచించిన కవితకును, సహజముగ రచింపబడిన గజళ్ళకును భేదమును గుర్తించినది - ప్రచలితములై కరతలామలకములుగ నుండిన కవి సమయములు - ప్రతీకలు - వ్యవహారములోని నుడికారములు సంధించి కవిత్వ రచన మొనర్చు నాటి సామాన్య ధోరణిని పరిశీలించినచో పద్య రూపము నొందిన రచన ఆనాడు కవితగా రాణించిన దనుట కెట్టి సందేహము లేదు.

గాలిబు సహజ కవి. ప్రజాభిప్రాయమునకు ప్రభావితు డయ్యు సామాన్య గోష్ఠికి సుదూరముగ నుండెడివాడు. శ్రోతలు - వయోవృద్ధులు - సమవయస్కులు ఒకరిద్దరులేక పదిమందియో తాము ఆశించినంత గాలిబు వ్యక్తీకరించక పోయినపుడు ఆశ్చర్యచకితులై యుందురు - కవితా సంప్రదాయమును పాటించి తనకు సహజమైన శైలని నుడికారమును అనుసరించినను అతడు వారికి కవిత్వామృతమును ప్రసాదించక తన ప్రయోగములతో ఊహించిన భావములను గ్రహింపుమని శ్రోతల సవాలు చేసెడివాడు.

అతని కవిత నర్థము చేసికొను శక్తి లేదను కొందురేమొ అని వారు గాలిబు కవితా గోష్ఠిని వదిలెడివారు కారు. అది వారి కొక విధముగ పరాజయము నంగీకరించినట్లయ్యెడిది. అతని కవితలో ఒక విధమైన గాంభీర్యము, హృద్యమైన పదముల పొందిక యుండెను. ఇట్టి శైలిని ఉర్దూకవితలో నెవరును సాధించలేదు. సంప్రదాయ పద్ధతిలో ప్రయోగించినపుడు స్ఫురించని నూత్నార్థములను గాలిబు ప్రయోగములలో చూపెడివాడు. సామాన్యపదములలో అనల్పమైన రమణీయార్థమును పొదుగు శక్తి అతని లేఖినికి గలదు. ఈ అంశమున గాలిబు కవితారీతి నాటి వ్యవహారమున ప్రచురితమైన నుడికారమును శక్తిమంతముగా ప్రయోగించెడి విధానమును, స్వచ్ఛమైన చమత్కార పూర్వకమైన నుడికారమును మించిపోయినది.

ఒక్కొక్కసారి శబ్దార్థములు విస్తృతమైన భావముతో విచ్ఛిన్నమయ్యెడివి. గాలిబు భావమును హృదయమునకు హత్తుకొనునట్లు చెప్పక చిత్రరీతిలో పదప్రయోగముల అల్లిక జిగిబిగిలో చిక్కుకొనెడువారు - గాలిబు నవనవోన్మేషమైన ప్రతిభ నభిమానించు ఒకానొక రసిక హృదయుడు కొన్ని గంభీరమైన పదముల నెట్టి అర్థమురాని రీతిలో కూర్చి అకవితను తన దృష్టికి వచ్చిన అపూర్వ కవితగా ప్రశంసించినట్లు ఒకానొక గాథ కలదు. గాలిబు ఎగాదిగ చూచుసరికి ఆతడా కవితలో నెట్టిభావము లేదని అంగీకరించెను. ఉత్తమ కవిత భావస్ఫూర్తి కలదియై యుండవలయునని కవి విస్మరించినచో ఇట్టిది ఇతర పద్యముల విషయములో సార్థకము కావచ్చు.

బేదిల్ మొదలగు ప్రముఖ కవుల శైలి ననుకరించి గాలిబు తొలి దశలో అన్వయకాఠిన్యముగల చిత్రకవిత లొనర్చెనని తెల్పుటకు ఎన్నియో ఉదాహరణములు చూపవచ్చును.

ప్రాచీన ప్రతీకలలో నూత్నార్థమును స్ఫురింపజేయుట కవితాలక్ష్యమగుటకు, సంప్రదాయకవితకు అపూర్వ శక్తిని కలిగించుటకు, నూత్న పద ప్రయోగముల కూర్పు తోడ్పడునని గాలిబు భావించెను. ఆత డిట్టి నూత్న రీతి ననుసరించి స్వయముగ పారశీక ఉర్దూపదముల సమ్మేళనముతో, ఆ భాషలలో ఆ పదములకు లేని అర్థములను కలిగించుటలో స్వేచ్ఛ వహించి, సంతరించెను. ఈ అంశమునం దాతడు అపూర్వమైన ప్రయోగము నొనర్చెను. ఆతని కవితలో భావపరంపరను గ్రహించుటకు కొన్ని సందర్భములలో కష్టమైనను రమణీయ భాషా ప్రయోగములు పాఠకుల పరవశుల నొనర్చును.

గాలిబు రమణీయార్థమును స్ఫురింపజేయుటకు ప్రయత్నించినవిధము, —ఆతడు దర్శింప జేయుటకు అభిలషించిన సౌందర్యానుభూతి - ఎట్టివి ? తొలిదశలో ఆతడు రచించిన ఖండిక నుదాహరణముగ గ్రహించి పరిశీలింప వచ్చును.

> నిరర్థక జీవయాత్ర నందఱు కొనసాగించెదరు
> ఈ జీవితము ననంతర జన్మమునకు అవతారికగా చేయుటకు
> ఉదాత్త ప్రణయమార్గమున సంచరించు; మానసిక క్లేశము
> విశ్రాంతి తీసికొనుటకు, విశ్రాంతి అది తాత్కాలికము.

దీనిని సామాన్య రీతిలో ననువదించిన సరిపోదు. ప్రతి ప్రయోగము లోని అంతరార్థమును వ్యాఖ్యానించి భావగాంభీర్యమును వెలువరించ వలయును. భావి జన్మములోని జీవిత కనుగుణముగ ఈ జీవనమును కొన సాగించి లౌకిక పారలౌకికములకు సమన్వయ దృష్టి ఏర్పఱచుకొనవలయు నని గాలిబు తెలిపెను. ఇది క్లిష్టతరముగను, అనుభవమున కతీతముగను తోచవచ్చు - దీని నంగీకరించిన మానవజీవిత ధ్యేయమును విస్మరించినట్లే అగును. సహజమైన రసానందము - ప్రణయము - భావావేశము-ప్రగాఢ మైన అనుభూతి మున్నగునవి ఆరాధ్యములు - మనము ఉదాత్త మానవు లమై మానవత్వము వహించవలయును. జీవితమును నిరంతర కృషి ప్రధాన ముగ నొనర్చవలయును. అలసట గలిగినచో మనము విశ్రాంతి నొందుటకు, ఊపిరి పీల్చుకొనుటకు వ్యవధి అనిగణించవలయునే కాని సుదూర ప్రయాణమని భావించరాదు. ప్రయాణమును కొనసాగించినచో అలసట అంతరించును.

కొందఱు ఇది నైతికమైన అరాచక ప్రతిపాదనమని అనుమానించ వచ్చు - ప్రణయ పారవశ్యము అవిసూచించే నిరంతర కృషి - అనువానికి సరియైన అర్థములేక వివరణమును కొంద రర్థించవచ్చు - కొందరికి అర్థమే కాకపోవచ్చు. దీనిని గ్రహించుట కష్టకార్యము కాదు. నైతికదృష్టిపై విశ్వా సము కలవారు అదియే పరిపూర్ణమైన ధ్యేయమని గ్రహించరు. అది మఱి యొక దానికి మార్గదర్శకము కావలెను - అర్థవివరణము కోరెడివారు ఏదియో కొంత తెలిసినదని తృప్తిపడవచ్చు - అర్థమును గ్రహించెడివారు, ప్రణయ భావమును కవిరమణీయముగ వ్యక్తీకరించుట ధర్మమని భావింప వచ్చు - తమకు సంతోషము ఉత్సాహము కలిగించునట్లు వారు తమ స్థాయిలో భావించి వ్యక్తీకరించవలయునని మాటలాడవలయునని అభిలషిం తురు - వారు నిశితముగ నాలోచించు భారమునుండి తప్పించుకొనుటకు వీలైనంతవఱకు ప్రయత్నింతురు. మానవుడు మానవుడుగానే ఉండవలయు నని, జీవితము మానవుడి ఆత్మశోధనముగా నుండవలయునని భావించి నవుడు వారు ప్రతిదానినిగూర్చి అదియేమైయుండునో, ఎట్లుండవలయునో అని వెనుకకు మరలి చూచుకొనుట కిష్టములేదని వారంగీకరించినారు.గాలిబు తాను శోధించిన తత్త్వమునుగూర్చి చెప్పలేదు. అతడు దానినిగూర్చి పరిశీ లించుటకు ఆసక్తి ని కలిగించవచ్చు-సంతృప్తి నొసగుట కవి ప్రయోజనము

కాదు. ఆతడు హృదయము నందొక విధమైన ప్రగాఢమైన అసంతృప్తిని వేదనము కలిగించి జీవిత సత్యమునుగూర్చి ఆలోచించి – జీవితమును సార్థకము చేయుటకు ప్రోత్సహించును.

సౌందర్య కాంతి నా దృష్టిని హరించినది
కనురెప్పలు మిగిలినవి, కాలి మిగిలిన వత్తులవోలె
దివ్యకాంతిని దర్శించే ప్రయత్నంలో
కన్నీటి ధార ఆరిపోయినది
హిమబిందువు కాంతి రేఖవోలె
స్వచ్ఛమైన చూపుమాత్రమే మిగిలినది.
కోరికల ఉద్యానవనం, కాలహస్త కరవాలము పాలైనది.
నా నిట్టూర్పువలె చప్పని వసంతం మళ్ళీ వస్తుంది.
సాక్షీదృష్టి మళ్ళింది – చషక భ్రమణమిక లేదు.
గోష్ఠిలో నిరాశ ఒకటే మిగిలింది.

దీనిని నిరాశాపూరితమైన భావవ్యక్తీకరణముగను, ఇతరకవులు సుబోధముగ, స్పష్టముగ చెప్పిన అంశమునే గాలిబు కవి మరియొక రీతిగ వ్యక్తీకరించినట్లును గ్రహింపవచ్చు – కాని ఈ పద్యపాదములను సూక్ష్మముగ పరిశీలించినచో మానసికమైన స్థితిలో కల్గిన మార్పుదశలు స్పష్టమగును. సౌందర్యమును, అకస్మాత్తుగ ప్రకాశించి కనుల మిరుమిట్లుగొలుపు మెఱుపుతీగవలె, కవి దర్శించినాడు – అది ఆతని కనులకు చిమ్మచీకట్లు క్రమ్మజేసినది – దృష్టిని హరించినది – పైపైన మాత్రమే అంటినది–ఏమియు మిగల్చనపుడు అగ్ని శిఖలేని ఈ దశలను చూపుట కెట్లు సాధ్యమగును– కనులు చూచుటకే ఉన్నవి కనుక అవి దాని చూచినవి. అవి తన ధర్మమును దాటలేదు – చివరకు స్థిరమైన దర్శనము కలిగినది – దర్శించిన ప్రయత్నమున కన్నీరు హిమ బిందువువలె ప్రకాశమానమైనది – దీనినే మరియొక విధముగ భావించవలయునన్న :—ఉద్యానవన శోభ అంతరించినది. అది పోవలసినదే – హేమంత ఋతువువలన అట్లగుట సహజమే – ఉద్యానవనమున పుష్పములను మరల వికసింపజేయవలయునను కోరిక –

వసంతము - దీర్ఘనిశ్వాసములతో తృప్తికలిగినట్లే - కొంత తృప్తి నొసగును. నిత్యజీవితములోని అనుభూతితో చెప్పదలచుకొన్న - సాకీకనులను చూచి చకితులగు కాలము గడచిపోయినది. పానపాత్రను ఖాళీచేసి మరలనింపు మని అడుగు కాలముకాదు - కాలచక్రము భ్రమించక తప్పదు - నిరర్థకమైన మార్పు ననుసరించి జీవించక తప్పదు.

ఈ విధముగ భావించినపుడు గాలిబు నవార్థమును సాధించెననుట కెట్టి సందేహము లేదు.

బహుళ ప్రచారము నొందిన గాలిబు పరిష్కృత కవితా సంకలనము లోని గజల్లు. సంప్రదాయ విమర్శన పద్ధతిలో పరిశీలింప బడినవి కాని ఆతని తొలిదశలోని రచనలు పూర్తిగ విస్మరింపబడినవి. ప్రాచీన సంప్రదాయము ననుసరించిన విమర్శకులు ఉర్దూ పారశీక సాహిత్యములు తప్ప ఇతర సాహిత్యములతో అపరిచితులు - ప్రియురాలు - ఈర్ష్య - ప్రేమికుడు- మొదలగు వానికి నూత్నములైన రమణీయార్థములను వ్యక్తీకరించుటతో పాటు గాలిబు ప్రయోగములలోని నవ్యతను ప్రత్యేకముగ తెలుపు శక్తి వారికి లేదు. ఆధునిక విమర్శకులు అవకాశము లుండియు వానిని పరిశీలన మునకు వినియోగించుకొనలేనివారు. సాహిత్య ఉద్యమములు - మార్క్సిజము విమర్శన ధోరణిలో సాగినందున చారిత్రక సాహిత్య సమ్యక్ దృష్టి భంగమైనది. స్వేచ్ఛాయుతమైన, సృజనాత్మక మానవ వ్యక్తిత్వముయొక్క భావము లేక దృష్టి వారి ఊహ కందలేదు. సృజనాత్మక శక్తిని పరిశీలించు గుణము లేక అనుభూతి లేదు - గాలిబు తొలిదశలోని కవితను పరిశీలించిన గాలిబు స్త్రీ అస్తిత్వమునుగూర్చి కాని ప్రియురాలి కల్పననుగూర్చి కాని చెప్పినవానిలో ఆతని ప్రేయసి ప్రతిబింబము స్ఫురించును. ప్రతీకల ప్రయోగములు సూచించు కృతక భావములను వెలువరించునది అని గాలిబును కేవలము ఊహాల నాధారముగ గొని విమర్శించుచున్నారు. వారి దృష్టి అనేక విధము లైనది - గాలిబు వీని నెంతవరకు అంగీకరించి యుండెనో తెలుపుట కష్టము.

గాలిబును సరిగ నర్థము చేసికొనుటకు, ఆతని దృష్టిలో అన్నిటికి మించి కవిత ఒక విధమైన సౌందర్యాత్మక, ఆలోచనాత్మక, ఆత్మాభివ్యక్తీకరణము అని గ్రహించుట ఆవసరము - ఏదియో ఒక ఆలోచనలేక విశ్వా

సము వలన ఆత్మతత్త్వ పరిజ్ఞానము నొందుటకు ఆత్మాభివ్యక్తీకరణము ప్రోత్సహించినపుడు ఫలితము భిన్నముగా నుండును.

దాని కదియే పర్యవసానమగు కవియొక్క ఆత్మాభివ్యక్తీకరణమును (ఉర్దూ పారశీక కవిది మాత్రమే) గూర్చి మాత్రమే ఇట ప్రస్తావించ బడును - అది, బుద్ధి, హృదయమునకు చెందిన అన్నివిధములైన బంధన ములనుండి విముక్తికై తపించునట్టిది. స్వేచ్ఛకై అన్వేషించునట్టిది. ప్రతి మానసిక వృత్తిని యథాతథముగను, సంపూర్ణరూపముగను స్వతంత్ర మైనట్టిదిగను గ్రహించవలయును. అస్తిత్వము నిరంతరము కలుగు మార్పు యొక్క పరిణామము కనుక చిత్తవృత్తిలోని మార్పు తప్పనిసరియని భావించ వలయును. మానసిక ప్రవృత్తి క్రమబద్ధ మొనర్పదలచినచో అది తక్షణమే జరుగవలయును కాని క్రమముగ కాదు. కవికి మానసిక వృత్తిని మార్చు కొను శక్తి - అధికారమునకు గజలులో విస్తృతావకాశము కలదు, ఈ చిత్త వృత్తులను సంధానించి కవిభావములను విశ్వాసములను పరిశీలించుట కొనర్చి ప్రయత్నము, ఖాజానసీరుద్దీన్ కొంగ మెడను కాళ్ళను నరికి వాని నొకచో చేర్చి ఇతర పక్షులవలె భాసింపజేయుట కొనర్చిన ప్రయోగమును మరల చేసినట్లగును. కవి స్వేచ్ఛతో జోక్యము కలిగించుకొనక విమర్శకుడు కవి మానసిక ప్రవృత్తులను, శక్తుల నొకచో చేర్చి కవితా రీతులను పరిశీలించుట తగును.

గాలిబు సామాన్యములైన చిత్తవృత్తులలో 'నేతి' అనునది ఒకటి. అది స్వయముగ నాతనికి గల సంతృప్తిని, అశాంతి దుఃఖము మొదలగువాని యందు శూన్యమై అనేక పరిధులుగల భౌతిక అస్తిత్వముయొక్క విలువను, త్రోసిపుచ్చును. దీనిని అతని ఆత్మవ్యక్తిత్వ నిరూపణమునకు చెందిన అసక్తి, దాని సహజ ఫలమని భావింపవచ్చు - ఇది అతనిని భౌతిక సత్యముతో నిరంతర సంఘర్షణమునకు తెచ్చును. ఈ సంఘర్షణలో జీవాత్మ పరా జయమునొంది కలవరపడును. ఈ 'నేతి తత్త్వస్థితిని గాలిబు రచనలలో ఎన్నియో సందర్భములందు చూచినను - స్థిరమైనది కాదు. దాని స్థితి ఎన్ని మార్పుల నొందినను మానవుడు మిగిలియుండును కనుక అదియే చివరి దశ కాదు.

నామమాత్రమున మతపూర్వకమైనదిగా భావింపబాలునట్టి గాలిబు చిత్తవృత్తి ప్రధానమైనది - అతడు సూఫీ తత్త్వమునకు సంబంధించిన

శాస్త్రము నధ్యయన మొనర్చి ఒక విధమైన అద్వైత తత్త్వము నంగీకరించెను. కాని సంప్రదాయపరులతోడి సహవాసముకాని అట్టి భావముకాని అతనికి అనిష్టమైనది. ఆధ్యాత్మిక ప్రపంచములోని స్వేచ్ఛవిషయమై అతని దృష్టి స్వతంత్రమైనది. స్వార్థపరుడు గర్వి - భగవంతునిలో లీనమగు పరమానంద స్థితి కాతడు కాంక్షించలేకపోయెను. భగవంతుని కరుణ కోరని వారిని, దోషాత్మకులు పాపాత్ములను ఆవేశించినపుడు, వసంతమువలె అది మద్యపాన ప్రియులకు మధ్యవర్తిత్వము కలిగించుటకు వచ్చినపుడు - గాలిబు దర్బారు అభిమానివలె చక్రవర్తితో మాట్లాడినట్లే భగవంతు డుద్దేశించి స్వేచ్ఛగ మాట్లాడువాడు - కాని తన దోషములను అనాచారములను, ఎన్నడును గణించలేదు - కోరికలు లేని హృదయముకంటె కాంక్షితము లేదు కనుక అతడు భగవంతుని దేనికైనను ప్రార్థించలేదు.

గాలిబు ప్రణయ చిత్తవృత్తి విలక్షణమైనది - అత డొక విధమైన విప్లవవాదియే కాని ఆత్మాభిమానమును ధారవోయుచు దాసోహమ్మనువాడు కాడు - సౌందర్య శక్తిని గుర్తించి ఒక్కొక్కసారి దానికి పరవశుడయ్యు అతడు తన ప్రకృతిని వీడలేడు - అనంతర దశలోని, ప్రేయసీ ప్రియుల గూర్చి అతని భావనలు కల్పనలు, ప్రణయమును గూర్చిన బాధలు కేవలము సంప్రదాయపూర్ణములు - ఈ స్థితిలో అతడు తన సౌందర్య దర్శన స్థాయి నుండికూడ దిగజారినను సంప్రదాయమును పాటించిన సందర్భమునందు మాత్రము అతని వ్యక్తిత్వము ప్రస్ఫుటముగా దోచును - అతని గజళ్ళలో నొకదానియందు ప్రేయసికంటె తనను గూర్చి అసక్తిని చూపెను. ఆమె సౌధోపరితలమున నీలికురు లావరించిన ఆననముతో, పరాఙ్ముఖియైన స్థితిలో కూర్చొని, కజ్జల రేఖాంచితములై, నిశితములైన కనురెప్పలు బల్లెములుగా మత్తిల్లజేయు మధుర యౌవనాకారముతోనుండ దర్శించినాడు - ఇవి అన్నియు సంప్రదాయపూర్వకమైన వర్ణనలు - అసహజ వర్ణనలు - కల్పనలు - సౌందర్య చిత్తవృత్తితో తాను దర్శించిన, రూపొందించిన అనిర్వచనీయ సౌందర్యమును, ప్రేయసి ననుక్షణము చింతనమొనర్చు కోరికనే గజలు చివరి భాగమున వ్యక్తీకరించెను. గాలిబు కేవలము సౌందర్యానుభూతినే కాంక్షించినాడు - ఈ ఉదాత్తస్థితి ప్రేయసీ ప్రియులలో నెవరికిని తెలియదు. కాని ఇరువురిని ఆకర్షించి పరవశ మొనర్చును.

గాలిబు మానసిక స్థితులను ప్రకృతి ఏమాత్రము ప్రభావితము చేయ లేదు. ఆతని మనసు నాగరికమైనది. ప్రకృతిని మానవ జీవితమునకు ప్రాతిపదికగనే గ్రహింపగలిగెను. అత్యంతోదాత్తమైన కల్పనము - భావ చిత్రము - సృష్టికర్త - గాలిబు కవితలోని సృష్టి - అంతయు స్వయముగ మానవుడే - గాలిబు ఉదాత్త చిత్తవృత్తి మానవునిలోని మానవత్వమును గూర్చియే చింతన మొనర్చినది - ఆలోచనలు, ప్రణయపూర్ణమైన అన్వేషణ మెంతదూర మేగినను అతడు తనకును, మానవునకును సన్నిహితుడై తిరిగి వచ్చును. మానవుడు పుష్పభరితమగు ఉద్యానవనము - వ్యర్థమగు ఎడారి, ప్రేయసీ సమాగమమును కాంక్షించు ప్రియుడు - ఆస్తిక, నాస్తికత్వ చదరంగములోని జంట - విప్లవవాది - విధివశమున ధూళిగా నలగిన ప్రాణి - అనాసక్తుడైన ప్రేక్షకుడు, దౌర్భాగ్యుడు - విధివశుడు. 'కరుణ'ను ఆకర్షించు అందమైన పాపము-సృష్టిని అల్లకల్లోలస్థితికి తెచ్చునట్టి ఉన్మత్త దశ. అన్నీ అతడే - గాలిబు మానవుని పరిశోధించి కనుగొనలేదు. కాని ఆతని ప్రకృతిలో - జీవన ప్రకృతిలో నూత్న అంతర్దృష్టిని కలిగించినాడు - ఆలోచనాత్మకమైన సాహసమునందత్యంతాసక్తి,నిరాకరించు ధైర్యము,విశ్వాసము, సార్థకమైన చిరునవ్వు - ఆతని స్వాతంత్ర్యమునకు గౌరవాభిమానములకు ఎదురొడ్డి నిలుచు పరిస్థితులు - మున్నగువానిని కల్పించినాడు.

# అనువాదములు

1. నా జిహ్వ నిన్ను ప్రార్థించాలని తపించుచున్నది
మౌనానికి నీ దయవలన ఇట్టి శక్తి అలవడినది
నేను అంతరించుచున్న దీపమును
శిశిర ఋతువున అరణ్యములో వికసించిన పుష్పాన్ని
దృశ్యములోని అందమును దర్శించుటకు
నీలో లయము కావలయును
అమర వీరుల రక్తమే మృత్యువు పాదములకు
పారాణి అలమును.

దుఃఖమే దివ్య వరము
మానవ హృదయమును చల్లబఱచును
రోదనమే సంగీతము.
రంగు రంగుల పూలను నీ సహస్ర రూపములకు
ప్రతిబింబములుగ జేసికొంటివి.
నతు లొసగే నొసలు - వేదిక
అన్నియు నీవే.
నిన్ననుగ్రహించాలని అనుకున్నపుడు
తగినస్థితి నతడే కలిగించును.
ఈ మలయ పవనము ఈ మందగమనము
వన, ఋతు, వసంతశోభ అన్నియు నీవల్లనే।
కాని వీని నర్థము చేసికొను 'అసదు'ను
పంజరములో బంధించుట। అదేటి న్యాయము.

• •

2. భగవంతుని దయ కన్నియు లొంగియున్నవి
వర్షమునకై తపించు పొలాలు-నీలాంబరమున

విలాసముగా విహరించు మేఘాలు
అతనివే.
భగవంతుని ఇచ్ఛ ననుసరించుట మేలు ॥
ఆతని అనుగ్రహము నొందుట మేలు ॥

• •

3. కోరికల సంపూర్తి కెన్నాళ్ళో యాచన
సంపూర్ణ అనుగ్రహానికి చేతులెత్తి
ప్రార్థించే శక్తినొసగుము నాకు.

• •

4. అల్పమైన ఆశలవారూ!
ఎందులకీ గర్వం, ఈ ప్రార్థనా విధానం?
ఉన్మత్త స్థితి! అన్నీ వ్యర్థం.

• •

5. ప్రణయకౌశలము నీ వైభవమునుచాటుచున్నది
ఈ నీ ప్రపంచము నీ దివ్య రూపానికి
సామాన్య ప్రతిబింబం మాత్రమే.

• •

6. సౌందర్య దర్శన దృష్టి
సహస్ర బింబముల సంతరించగలదు
ధూళిలోని ఒక్కొక అణువు ఆతనికి
ఎంతో మైకం కలిగించే చషక మగును.

• •

7. నీ ఉనికి భ్రమ! ఎడారి వంటిది
దానిని నమ్మి భ్రమించకు
అజ్ఞుడవు - నీవీ తత్త్వము గమనించు.

• •

8. ఎంతకని చూతు నీ అందాల జాడలను
మనో ముకురంలో నీ జాడలను
ఒక్కసారే దర్శించనిమ్మ !

•                    •

9. ఈ సుందర పానశాలలో ప్రతి అణువు
మధుభరితమై తిరిగే చషకం వంటిది
ప్రేయసి చూపులు తిరిగే దిశలో
ప్రియుడు పరిభ్రమించును

•                    •

మధుర స్వరాలు విన నేరనివారము
అవి అన్నియు తంత్రిలో సంగీతమువలె దాగియున్నవి.

•                    •

10. క్షణములో అవతరించి అంతరించు
బిందువు, బుద్బుదము, తరంగము
లన్నియు నీటికి రూపాంతరములు
సముద్రము అస్తిత్వానికి చిహ్నములు.

•                    •

11. కనులెత్తి రెప్పలు విప్పి
దివ్యరేఖల నెన్ని జూతును
చూచే శక్తియు లేదిపుడు
అంతటి కృతజ్ఞతాభారము నెట్లు సహింతు.

•                    •

12. సికతా రేణువు ఎడారి వైశాల్యాన్ని
నీటి బిందువు సముద్ర గాంభీర్యాన్ని
వహించును.
ప్రణయము సామాన్యులకు నూత్నశక్తి నొసగును.

•                    •

13. వినతుడనై నేను ధ్యానించే
ఆ దేవుడు ఊహాతీతుడు
దృష్టి కలవారికే కాబా
కిబ్లా దిక్సూచి మాత్రమే.

•  •

14. విగ్రహాల ఛేదించుటలో నేర్పరులము కావచ్చు
అహంభావమును ఖండించనంతవరకు
మార్గములోని బండరాళ్ళను దాటలేము.

•  •

15. పరిపూర్ణ విశ్వాసము ఆరాధనీయము
ఆలయంలో వసించే అగ్రజన్ముడు కన్ను మూసిన
కాబాలో సమాధిచేసి గౌరవించవచ్చు
అందుల కర్త దాతడు.

•  •

మందిరము మసీదు
నిన్ను చేరుటకు నరుడు కల్పించుకొనిన
మార్గములు : కథలు గాథలు
పురాణములు నీకై చేసిన కల్పనలు

•  •

16. నీకై వెళ్లి నబృందంలో కొందరు
అలసి అక్కడక్కడ ఆగినారు
అదే మజిలీ అనుకొన్నారు
ఆలయం కట్టి ప్రార్థన చేసినారు

•  •

17. ఈశ్వరు డొక్కడని మా విశ్వాసం
ఇతరమైన కర్మలన్నీ వృథా వృథా
వివిధ మతాలన్నీ అంతరించినపుడే
ఈ సిద్ధాంతం నిలుస్తుంది.

• •

18. పరమాత్ముడు నీ కోరిక
మన్నిస్తాడని నమ్మకమున్నపుడు ఏమియు అర్థించకు
వాంఛ ప్రగాఢమైన
దేనికి తపించని హృదయ మిమ్మని ప్రార్థించు.

• •

19. సముద్రము పొంగి తీరాన్ని నెట్టివేయును.
నీవు సాక్షివైన
పాన మొనర్చకయె మత్తులము మేము.

• •

20. ఏదో మైకంలో లీనమైనాను
నన్ను నేను తెలిసికొను మార్గమే లేదు.

• •

21. జలబిందువును చూచి
సముద్ర గాంభీర్యాన్ని దర్శించలేనపుడు
కన్నులున్నాయని భ్రమించకు
ఈ చూపులు పసిపిల్లల ఆటలు
బిందువు బిందువుగానే తోచును.

• •

బిందువు సముద్రములో లీనమై ఆనందించును
వియోగ బాధాతిశయమున
కా స్థితియే మంచి మందు

• •

22. నీ అనుగ్రహానికి
సమర్పించే నా హృదయం-తగనది
నే చేసిన పుణ్యకార్యం
శతవిధాల పాపపూరితం.

* *

23. పరమాత్ముని దయాహృదయ శక్తి
ఎట్టిదో చూడు !
నావంటి విగ్రహారాధకుని,
పాపము చేసితినని ఎఱుగనివాని
క్షమించినాడు.

* *

24. నే చేసిన పాపాలకు సమాధానం
చెప్పలేక సిగ్గుచే మౌనం వహించినాను-
దానినే భగవంతుడు మన్నించినాడు.

* *

25. ఏ తెరచాటున దాగియున్నావు ప్రభూ
నిన్ను నీవే చూసికొనుచు !
మూసిన పెదవులు-వినతాక్షిలు
నీ దయనే కోరును

* *

26. నా వస్త్రాంచల మొకమారు ముంచితినొ లేదొ !
పాప సముద్ర మంతయు నందు ఇంకిపోయె.

* *

27. పరమేశ్వరు డొసగిన రెండు వరాలు
లౌకిక పారలౌకికములు
కొందరికీ లోకము - మరికొందరి కా లోకము

రెటింను పొందిన భాగ్యవంతు లొకరిద్దరే!
ఆతని నేమని అడుగను - ఇచ్చెది దేమిటి?
ఇంకను అతని నడిగెడి దేమిటి?

*   *

28. బలవంతము చేయకు! చేసిన పాపాలెన్ని? అని
ప్రతిక్షణము తికమక పెట్టెడు కోరికల గుర్తులు
కుతూహలము - దుర్బుద్ధి
స్మృతిపథమున సంచరించు.

*   *

వసంతాల అందాలను ప్రేమిస్తాను
వికసిత పుష్పాలను తెంచాలని తపిస్తాను
సౌందర్యారాధన పాపమైన - నన్ను క్షమించు
నా ఆశలె పాదాలక్రింద నణచివేయును
వానిగూర్చి చెప్పనేల - చెప్పుట వృథా!

*   *

29. ప్రాణము లొసగినవానికి
ఆసువు లర్పించినాను
చేయదగిన కార్యాలెన్నొ
చేయలేక పోయినాను.

*   *

30. 'తూరు' పర్వతమును ఛేదించిన పిడుగు
నాపై పడినను బాగుండెను
అది నే ననుభవించదగిన
మద్యం వంటిది.

*   *

31. మధురమైన ఆనందాల రూపకల్పనకై
తపించును నా కవిత-
వసంతశోభ-ఉద్యానవన విలాసం. ఇవి ఏమీ లేక
ఆవిర్భవించిన బులిబులి పిట్ట నేను.

•　　　•

32. ఆలోచనాగ్నిని రగిలింపజేసెడి
తుపాను గాడ్పులవంటిది నా శక్తి
ఆవేదనచే మండెడి అగ్ని కావాలి
నా గుండె పూర్తిగ కాలని ఇట్టుక.
జ్వాలలు రేగే అగ్ని వలదు
మిరుమిట్లు గొలుపు శక్తి కావాలి.

•　　　•

33. అలసట అది ఒక నెపము
ఆసక్తమగుట అది ఒక భ్రమ
కోరిక దృఢమైనపుడు పాదాలకు బొక్కలు రావు
శ్రమ అనిపించదు.

•　　　•

34. తన్మయులై వినుట-సంగీతం-
లౌకిక నిరాసక్తత-నిషా-
సౌందర్యాన్ని అనుభవించే భోగివి కావలయును
మూర్తీభవించిన నీవు తప్ప
లోకమంతయు పవిత్రమని భావించు.

•　　　•

ఎదలోని ప్రణయోన్మాదము నణచిన
అది గుండె నావరించును

కన్నీటితో హృదయక్షేత్రమును
ఆర్ద్రి మొనర్చుము-

* *

35. అత్యంత నిరాశాస్థితి
కాలపు కష్టాలను లక్ష్యపెట్టదు-
వినరాని నిట్టూర్పులలో
నిత్యవసంత మవతరించును.

* *

36. ప్రణయపు విడారు లెన్నియో
ఎడారులలో అంతరించినవి-
సాహసం చేయు దృఢసంకల్పం
ఆ మాత్రానికే వెనుకంజవేయదు.

* *

37. నీలి కురుల నీడలు వ్యాపించిన రేలలో
క్షణిక సుఖానికి తపనమేల
నా గుండెల వాడిన గులాబి
ఆరిన దీపపు నల్లని ధూమం
ఒక రాత్రి సుఖానికింత హడావుడి యేల?

* *

స్వల్ప పరిధిలో త్రాగి
మైమరచెదనని గర్వమేల?
అనంతకాలంలో నీకు లభించిన దొక క్షణం
బుద్బుదప్రాయ జీవితం-

* *

ఎడారిలోని ఎండమావి వంటిది లక్ష్యం
తీరని కోరికల లోయలలో
గమ్య మెరుగని భ్రమణ మేల ?

* *

38. జీవనమొక ధ్యేయమునకు పయనముకాదు
మృత్యువునందును శాంతిలేదు-
ఈ జీవిత యాత్రలో పాదాలలో కంపనం
నడకలో స్ఖాలిత్యము లధికం.

* *

గాఢనిద్దుర నీ కనుచూపులో దాగి ఉన్నది
దినశోభ అంతరించిన నీడలలో
సాయంకాలం నిలిచియున్నది.

* *

39. అజ్ఞతవలన గర్వించెదము
అదుపులో నుంచెదమని
మనసులోని రహస్యాలు
మనసునే కరిగించివేయును.

* *

40. ఉన్మాదమును దాచే ఇంద్రజాలపు భూమి ఇది
మృత్యువు కష్టాలను
తొలగించుననుట భ్రమయే.

* *

41. నానా రకాల పూలవలె వికసించటం
అగ్నికణాలవలె ప్రకాశించటం
ఈ పరిణామదశలో - పరిశ్రమ సాధ్యం
ఇదంతయు ఎవరికొరకు ?

42. దుఃఖవిచారసు అవ్యక్త స్థితిలో
దూరపు కొండలలో లీనమైనవి.
ఆవేశము నిశ్శబ్దరూపము దాల్చిన
జీవనంలో ఆలాపన-స్వరమాధురి వ్యర్థం-

* *

43. ఈ భువిలో కష్టసుఖాల మర్మమెఱిగితి
ఫలితము - అలసిన సుదీర్ఘ జీవనం-

* *

44. ఆశ - భయావస్థలకు
కృతజ్ఞత - ఆందోళనలు దుష్ఫలితములు
జ్ఞానపూర్ణమైన హృదయము
ఒక విధమైన శాపము.

* *

హృదయ గ్రంథులు విప్పినపుడే
విశాలమై ఆనందమున పొంగిపోవును
అపుడే అనుభవించవచ్చు
గోష్ఠిలోని ఆనందం - ఉల్లాసం.

* *

నీవు గ్రహించిన మద్యచషకం
అలసటను నిర్ణయించే కొలత కాదు
పాదాలలో ఏర్పడిన పొక్కులు తప్ప.

• •

ఈ ప్రణయ గోష్ఠి మద్యంపై పేరిన నురుగువంటిది
పాప మొనర్చిన వారి స్నేహం ప్రగాఢం-

ఒకరి అనుభవాన్ని అడుగక
ఆనందాన్ని అనుభవించు-

• •

ప్రేయసి కనురెప్పలు వికసించినంతలో
పంచప్రాణము లెగిరిపోవు-
పోయిన ప్రాణములు క్షణములో వచ్చును
ఈ కనురెప్పలలోనే స్వర్గ నరకాలు
కష్టసుఖాలు-

• •

కమ్మతెమ్మెర వీచినపుడు
ఎగురుటకు రెక్కలేవి ?
పారవశ్యపు స్థితిని పొందు
మానసిక స్థితి యెక్కడ
దీపకళికవలె కరిగి అరిపోయి
గుండె నీ రగు స్థితిలొ నున్నది-

• •

45. బులిబులి గీతంతో మైమరచిపోయెదము
పూలు వికసించిన ప్రాణము లెగసిపోవు.
అయినను గర్వించెదము
సహనము - అపకీర్తి భయము కలదని-

• •

46. ఈ నా ఊపిరియే తరంగము
సముద్రములో లీనము
సాక్షీ మందహాస తిరస్కారము
ఆమె నేమని మందలింతును ?

• •

47. హృదయావమానం చూచి
ప్రణయరోదనము పెల్లుబికినది
గీతంలో నగ్నముగా వ్యక్తమైనది.

•     •

48. మత్త హృదయస్థితి
కనురెప్పలపై ఆవిరిబిందువుల జూచి
లోని అగ్నిని చూడుము-
కన్నీటి కాలువ దాటిన - ఇంకొక పానశాల-

•     •

49. మధుచషకము కూజాలను
ముక్కలు ముక్కలుగా నొనర్చితి
ఇపుడు గులాబిరంగు మద్యము వర్షమై
స్వర్గమునుండి కురిసిన ప్రయోజనయేమి?

•     •

50. కన్నీటి బాధలు చూపుటకు
ఉపమలు - రూపకములు సరిపోవు.
సముద్రమను పానమొనర్చుటకు
ఎడారియే కావలయును?

•     •

51. నీ కెవరివలన జ్ఞానోదయమగును
చెవులు వినరావు గింగురు మనుచున్నవి
గుండెలు, గీతికలకై తపిస్తున్నవి.

•     •

52. ప్రపంచమొక విశాల విహారస్థలం
అలసినచోట యాత్రికులు
కట్టిరి విశ్రాంతి గృహాలు.

53. తృప్తియే ధ్యేయమైన
ఇంత ఘర్షణ యేల?
జీవితమును కాలముకంటె చషక భ్రమణముపై
త్యాగము చేసెద.

• •

54. ఈ లోకము నా ప్రణయదుఃఖమును
తెల్పుటకు సరిపోదు
తపన - తీరని కాంక్షలతో
పరలోకానికి పయనమైతి.

• •

55. ఉదారమైన వసంతం
పాపీ రోజాలను సృష్టించును,
పాపీ బొద్దులోని సిలిమనంటి దానిని
పూలగుండెలో నివసించాలని వ్రాసి ఉన్నది.

• •

56. గులాబి రేకుల కోమలశరీరం నాది
ప్రణయతాపము కష్టతరము
ఛిన్నాభిన్నమైన రేకుల
ముండ్లతో కుట్టినారు.

• •

57. నా మోహం ఈ రెండు లోకాలను
దాటిపోయింది.
సుకుమారబుద్ధిని - తపనను సహించలేను.

• •

ప్రతి పరమాణువు మత్తిల్లే చషకంవంటిది
నేను ఏ ప్రేయసి హృదయమునో
రెండు లోకాలను మించినదానికి తపిస్తున్నాను.

58. ప్రళయ ఘోష అంతరించిననాటి
స్మృతిచిహ్నము నా హృదయ స్థితి!
నన్ను నేను తెలిసికొనుటకు తిరుగుచున్నాను.
ఈ ధూళి శూన్యపుఎడారివైపు పయనిస్తున్నది.

* *

ఎండమావి పరమావధి జూచి భయమేల
నన్ను జూచి తెలిసికొనుము.
ఆ దారిలోని ధూళిని నేను
ఈ చిక్కులు ఎవరిని బంధించవు - బాధించవు.

* *

59 పంజరములోని బందీని నేను
ఉద్యానవనమున జరిగినది చెప్పుటకు భయపడకు
నిన్న నా కుటీరంపై పిడుగు పడినను
నా కేమి సంబంధం??

* *

60. నిదురలో కలలు కనుచున్నాము మేము
నిదురలో మేల్కొనుట జీవనము-
జీవన స్వప్నమంతరించిన మేల్కొందుము
కలలో మేల్కొనినవారు నిదురించినట్లే!

* *

61. చేతి బాకును జివ్వున లాగిన
వధ్య వేదిక కడ విచారమేల
అది యెంతో సంతోషకరము-
చూడదగిన దృశ్యము.

* *

మనిషి మనిషి అగుట సులభము కాదు-
చేయదగిన కార్యములు
శ్రమసాధ్యములు.

* *

62\. సౌధము
తనలో వసించువారికి భాగ్యము కలుగజేయును
మజ్నూ సంచారమున పచ్చబడిన ఎడారి
ఆతడు వీడినంతనే ఎడారియైనది.

* *

63\. పిచ్చివాళ్లు ఇల్లు వీడి
ఎడారికి వెళ్లెదరు-
వారికంటెను ఘనుడను నేను
ఎడారియె నన్ను చేరవచ్చినది.

* *

64\. అచ్చమైన ప్రణయమునకు
హంగులేవియు నుండవు
చిత్రము తెరచాటున
మజ్నూ నగ్నముగ కనిపించును.

* *

65\. గిరవుపెట్టిన గుండె - ప్రేమించు ఆత్మ-జీవితాసక్తి
మెరపుతీగను పూణిస్తాను
దాని ఫలితాలు విచారిస్తాను.

* *

66\. సృష్టిలో పరిశ్రమల తమషా చూడు.
కనులు ప్రతిబింబాలను విక్రయించిన
అలోచనలు వానికి అద్దాలు కట్టును.

* *

67. ఒక్కొక తరంగం
బిందువున కపాయకరం
బిందువు ముత్యమగుట కెన్ని ఆటంకములు॥
తరంగాలలో దాగియున్నవి మొసళ్ళు॥

*    *

68. ఈ దుఃఖము నెట్లు భరించుచున్నాను
రాతికే రాపిడియున్న
దాని నరాలు చిమ్మెవి రక్తాన్ని.

*    *

ప్రేయసి వస్త్రాంచల స్పర్శనొందిన
సౌరభము నాఘ్రాణించుట కాసక్తి లేదు
మందపవనము లీ స్థితిలో
ఎటు వీచిననేమి?

*    *

69. ఈ దుఃఖములు ప్రాణాంతకములు
ప్రణయబాధ వీడిన
ప్రాపంచిక బాధలు చేరును-

*    *

70. నా కన్నీరు లేకున్నను
నా ఇల్లు దిక్కుమాలి యుండెడిదే.
సముద్రము జలభరితం కాకున్న
ఎడారిగా నుండెడిది।

*    *

71. నా కన్నులు వికసితములు - ఉద్యానవన మల్లే ఉన్నది.
సూర్యోదయము సోకిన హిమబిందువును నేను

*    *

72. ఒంటరితనము వదలుటకు
నిస్సంగత పనికిరాదు.
ఎట్లున్నను అవమానం తప్పదు.
ప్రతి ఊపిరి అవమానబంధనములోని ఒక కట్టు.

*　　　　　　　*

73. నేను రాగమువలె వికసిత పుష్పమును కాను
ఆలాపన - వికాసము సరిగా చూడలేము-
నా ఓటమిని చాటు శ్రుతిని నేను

*　　　　　　　*

74. మధురస్మృతు లెన్నియో
''మరపు'' అరలో దాగియున్నవి.
అందము లెన్నియో అణగియున్నవి భూమిలో
'లాలా' 'గులాబీ'లుగ జన్మమెత్తునా ?

*　　　　　　　*

జీవిత పరిధి దీర్ఘమైనను
ఒక్క చూపున కగును.
చీకటిలో నటించే అగ్ని కణమువంటివారము మేము

*　　　　　　　*

జీవించినవారికే వియోగబాధలు తెలియును
ఈ బాధకు మృత్యువే మందు
దీనికళిక నొసట అన్ని హంగులతో
మంజుకయే వ్రాసియున్నది

*　　　　　　　*

75 అత్యంతమైన ఏకాంతములో
జీవించాలని ప్రగాఢ వాంఛ.
నా భాష తెలిసి నాతో మాటాడనివారు
నా ఆలోచనతో పాలుపంచుకొననివారు
లేనట్టిచోట--

గోడలు తలుపులులేని ఇల్లు కట్టాలని ఉన్నది.
ఇరుగుపొరుగు ఏమియు వలదు
ద్వారపాలకు లసలే వలదు.

* *

విచారము, రోగముతో బాధపడిన——
వైద్యము చేయువారు వలదు.
అసవులు పీడిన——
స్మృతిగీతిక పాడువారును వలదు.

* *

జీవితాశ్వము కదను త్రొక్కుచు
పరుగులెత్తింది!
ఎప్పుడు! ఎక్కడ? ఆగునో?
అన్నియు వశము తప్పినవి!!

*

77. వడివడిగా పరుగులు తీసే
వారివెంట వెళ్ళితిని
నాకు ధ్యేయం లేదు-
దర్శకు డెవరో తెలియదు!

* *

78. పాదముల పొక్కులతో జడిసితి
కంటక భూయిష్ఠమార్గము
చూచుసరికి మనసు రంజిలెను.

* *

79. విజృంభించిన భావావేశం
తరంగంవలె మదిని వణికించెను
సుకుమారమైనది అది
ఘాటైన మద్యంలో కరిగే సీసావంటిది

స్వేచ్ఛాజీవులకు దుఃఖం క్షణికం
వియోగాంధకార గృహమున
దీపము వెలిగించుటకై
విద్యుల్లతనే తెచ్చెదము!

*                                        *

80. ప్రగాఢ వాంఛ!
ఒక పాదమునకే విశ్వము సరిపోవును.
రెండవ పాద మెచటనుంతును ప్రభూ!

*                                        *

81. మానవు దేకాకి
ఆలోచనల బృందమునకు ప్రతీక
ఏకాంతమునందున్నను
గోష్ఠిలో నున్నట్లే!

*                                        *

82. ప్రపంచం జనసమ్మర్దముగా నున్నది
ధైర్యవంతులు లేరని తెలుపుచున్నది.
పానపాత్రలు నిండుగా నున్న
మద్యపానాని కెవరును రాలేదని తెలుపును.

*                                        *

83. నా మానసిక తీవ్రత నెట్లు వర్ణింతు
ఉన్మత్తదశలో ఆలోచన అంకురించినదో లేదో
అడవిని క్షణంలో భగ్గుమనిపించినది.

*                                        *

84. ప్రణయ పారవశ్యపు స్థితి దర్శనీయము
నిశిత కరవాలధార దాని ఎదను చీల్చి సాగును,

*                                        *

85. ఎదలోని గాయము మానలేదు.
అది ఎంతో తృప్తికరం
గుండెలోని బాధ గర్వకారణం.

*     *

86. వినినచో నమ్మకము కుదరదు
చూచినను కనులు విశ్వసించవు
విశ్వమోహన సుందరరూపమున రమ్ము
చూచినట్లు నీకుగాని నాకుగాని స్పృహ ఉండదు.

*     *

ఆతిథ్యము మూర్తీభవించిన రూపము
ఎత్తినచేతు లాహ్వానించును
కురులను లీలగా తాకుట-భుజముల అందము చాటుట-

*     *

87. సౌందర్యము తన ముసుగు ముడులను విప్పెను
ఇపుడైనను చూడలేకున్న
నీ చూపు నీకు అడ్డముగా నుండెనన్నమాట!

*     *

88. నిన్ను సమీపించిన
నీవు కావు
ప్రణయము నపకీర్తి పాల్జేయకు

*     *

89. అనదూ! ప్రణయ గాయపు కస్తురి మచ్చ గుబాళించెను
దీప సౌందర్య జనితమది
వియోగ నిశల వెలిగినదా దీపిక.

*     *

90. ఇపుడే సమాగమవేళ ఆరంభమాయెను
ఎదలో గాయపు మచ్చ లేర్పడసాగెను
గోష్ఠి తేజము దాని రూపమును సగము చేసెను
నాగుండె కూడ సగమే దహింపబడెను.

*　　　　*

అరుణోదయ సమయానికి
గమ్యము చేరవలసి యున్నది
దీపకళిక ధూమమె
ప్రయాణపు ధూళియై కన్పించెను.

*　　　　*

91. విశాల విశ్వమీ ఆకసమున
నష్టమైనను బాధ లేదు.
ప్రణయ విశ్వాసములు సరిగనున్న చాలు

*　　　　*

92. ప్రణయముతో జీవిత సుఖము తెలియసాగెను
అన్ని రోగములకు మందు అది
అయినను దాని బాధకు మందు లేదు.

*　　　　*

గుండెలో నిప్పులు చెలరేగుచున్నవి
గాటపు గాయానికి ఎద తపిస్తున్నది.

*　　　　*

93. ఈ ప్రపంచం - ఉన్మాద గృహం - ఇచట
దీపికవలె మండటం
కాంతి చిమ్మటం, నా నొసట వ్రాసి ఉన్నది.

*　　　　*

94. ఆమె - అలుక - విలాసం - కటాక్ష దృష్టిని
తెల్పవలెనని నా ఉద్దేశం
కత్తులు బాణాలు
ఉపమలు ఉత్ప్రేక్ష లెట్లు తప్పును.

* *

95 ఆశించినకొలది అనుగ్రహాతిశయము లభించును.
ముత్యముగ తృప్తినొందని నీటిచుక్క-
కన్నీటి బిందువై అవతరించును.

* *

96. సముద్రపు అశాంతి ముత్యములో నిమురణాలక
ప్రణయము గుండెలో బందీయై నిలిచినట్లుండును.

* *

97. నే నామె చేజిక్కిన
ఎగురజాలని పక్షినని అర్థము కాదు-
వేటకా డిష్టుడుకాన నేనె వశమైతిని.

* *

98. వసంతోదయ ఉద్యానవన శోభ
దర్శనీయము
గోష్ఠి అనంతరము నిలిచే అంద మే అందము.

* *

99. మద్య సంగీతములు మనసును రంజింపజేయునని
భ్రమనొందే పాతకాలపు వాళ్ళు వీరు
ఎదలో మంటలు రగులు వారి
నే మనకు-

* *

సుదీర్ఘ వియోగరాత్రుల కాలపరిధిని లెక్కిస్తే
ఈ పాడులోకాన ఎప్పటినుండి
బ్రతికి ఉంటినో ఏమి చెప్పను.

• •

100. సౌందర్యానికి ప్రణయానికి ప్రగాఢ స్నేహం
ఒకదాని కంటకములు విచ్చుకత్తివంటివి
ఇంకొక్కటి నగ్నపాదాల పొక్కులు బాధించును.

• •

నాతో తప్పించుకొని తిరిగెదవేల ?
నీలి కురులనుండి అలుకను తొలగించు
నీ చిఱునవ్వుల నే నిక కోరను !

• •

101. ఒకనాడు కలలో ప్రత్యక్షమై
మళ్ళీ వచ్చెదనని మాట ఇచ్చినది
జీవనమంతయు నిరీక్షణలో
గడుపవలెనని భావమేమొ ?

• •

102. కొందరి అందం ఊహాతీతం
దానిని దాచుటకు బురఖా అనవసరం
అందమె ఆమెకు కవచమైనపుడు
తెరచాటున దాగుట ఎందుకు ?

• •

103. నేను చెప్పిన దామె కర్థముకాదు
గ్రహించలేదు కూడ-
ఆమెకింకొక మనసైన ఇమ్ము
లేక స్పష్టముగ చెప్పు శక్తినైన నా కొసగుము.

• •

104. నీలి కురులను వంకరగా
తిప్పుచుంటివి
నా ఊహలు నానా విధములుగ
దూరదూరము పరుగులెత్తెను.

*                    *

నా నిట్టూర్పులు నీ ఎదను చేరుటకు
సుదీర్ఘ జీవిత మవసరం
నీ పొందు లభించువరకు
అసువులతో ఉండేదెవరు?

*                    *

నా అనురాగమును త్రోసిపుచ్చవని తెలుసు-
ఆలోపల నేను మట్టిలో కలిసిపోదునో ఏమొ ॥

•                    •

నే నొక హిమబిందువును
సూర్యకిరణం సోకువరకు జీవించువాడ.

•                    •

105. ఏమి చెప్పవలయునను కాలం గతించినది
నోరు విప్పిననాడు ఫలితం శూన్యమైనది
ఇపుడేమి చేయను.

•                    •

నిన్ను దర్శించి ఏమి భాషింతును
సభ్యత సంస్కారము వలయును
ఎక్కడలేని సిగ్గు-అయోమయ స్థితి-
ఏమని చెప్పను.

•                    •

నీకై పూజ లెన్నని చేతును
ఎన్నాళ్ళని చేతును
ఫలితం శూన్యమైనపుడు.

*          *

అద్దములో చూచి నీకు నీపై ఈర్ష్యనొందెదవు
నిన్నుపోలిన వారొకరిద్దరు
ఉన్నచో కష్టంగానే ఉండెడిది.

*          *

106. దేవుని పూజించదు - విశ్వాస శూన్యురాలు
ఇది నగ్నసత్యము
ప్రాణాలపై తీపిగలవారు
ఆమె సౌధానికి దారితీసే 'గల్లీ'లకు
పోవనేల ?

*          *

107. నీలి కురులు
విదురించే బాహువులు కలవాడే
భాగ్యవంతుడు-
ఆతనికే చిత్తశాంతి - ప్రణయనిశల
ప్రగాఢ నిద్ర.

*          *

108. నీవలన పడిన కష్టాల
నడుగబోకుము మాటిమాటికి
గుండెలోపలి బూడిద నెగచిమ్మకు ;
అగ్ని దాగియున్నదా చోట ;;

*          *

ప్రేమతోడను చేరదీయని
ప్రేయసి యున్నను బాధలేదు
అంచనడకలు, విలాసదృష్టులు
మనసుదీరగ చూడవచ్చును.

*        *

వసంతమున కాయువు కొన్నినాళ్లు
అయినను అది వసంతమే
కనులకింపగు పచ్చిక చిగుళ్లు
మందమారుత మెదనుదోచును.

*        *

109. ఆమె నేడే రానున్నదని వార్త :
చూడుమన్నట్లీనాడే
చింపి చాపైనను లేదు.

*        *

110. మనిషి దేనికో తపనమొంది సంతసించును
మృత్యుభయమే నరునకెపుడు
జీవితములోని రుచిని చూపును.

*        *

111. క్షణమైనను తీరికలేని బ్రతుకదేటికి ?
విశ్రాంతి కోరినా వెదకుటకు ఓపికేది ?
ప్రేయసిని స్మరించుటకు తీరికేది ?

*        *

112. నీ విశ్వమోహన రూపమునకై
హృదయమెంతో పరుగులెత్తును

క్షణక్షణమూ ప్రాణమొలిచే
దర్శనమ్మది నాకు వలదు-వలదు నాకు.

*       *

113. నీ దర్శనం కాంతిని చిమ్మను
ఎదలో వేయి దీపాలు వెలుగును
అందమనిన విశ్వాసము లేనివారు
నమ్మక తప్పదు ॥

*       *

114. తన్ను తా నెరుగని అందానికి శక్తి అధికం
ఎన్ని గుండెలనో చిత్తుచేయునది.

*       *

115. ఒక్క వాడిచూపుతోనే
దీపికవలె కరగిపోయెదను.
సింగారించుకొని వచ్చే
శ్రమ ఎందుకు ?

*       *

అందాల సామ్రాజ్యానికి కప్పము
పానశాలలోని మైకం-
మద్యమే ఆమె కనుల మైకానికి
జోహారు లర్పించును.

*       *

116. అందముతో ప్రాణము హరించుటకు
పూనుకొన్నది ప్రేయసి ! ఏమిచేతును ?
ఆర్ద్ర హృదయములోని గాయము
కూడలేదింకను-

ఎదను దూసే కత్తి వాడిది
దానికంటె చూపు నిశితమైనది.

• •

117. తనను తాను తెలిసికొనని
అందమంటే అదే గొప్ప
తన సొగసుకు కంటి కాటుక,
చూపులకు అభ్యంతరము కలగజేసెను

• •

118. వినయ పరిమితులు గౌరవ లోకముల
ప్రతిబింబించును - ఎప్పటి
నుండియో ఈ అంశము తెలిసె
నొక్క చూపులోనే.

• •

119. అసదూ ! మెత్తగా ప్రాణాలుదోచే
ఆమె ధోరణి ప్రశంసార్హం !!
నామమాత్రంగా మాట ఇచ్చుట-
మరిపించుట - తెలియక కాదు !!

• •

120. ఎంత హృదయాకర్షకం
ఈ నిశాత విలోకనం
పైకి లజ్జావిలోలం కాని
గగన సముత్తాలం.

• •

121. మా క్షేమము విచారించపోయినది ఆమె
నేను నా ఇదిలో లేను - ఆలోచించలేను
చెప్పుటకు శక్తి చాలదు.

• •

ముసుగు వీడిన ప్రేయసి ముఖం
నల్లని కురులతో చంద్రబింబ మనిపించినది
దశదిశల వెన్నెల కురిపించినది.

*                *

122. నీ ఒక చిరునవ్వు - ఒక మాట
నా మదికెంతో ఆశాకిరణం - నీ దయ లభించెను.
దీపాలతో తళతళలాడే
నగరంవలె పొంగిపోయెదను.

*                *

123. నా క్షేమసమాచార
మడుగనివారి కేమి చెప్పను ?
వారికి కృతజ్ఞతలు
చెప్పుటకు నోరాడదు - మాటలు రావు.

*                *

124. నేను నా దీనావస్థ నామెకు
తెల్పనున్నాను
ఆమె సమక్షమున
నేమి చెప్పగలనో ? నాకె తెలియదు.

*                *

125. ఈ ప్రణయస్నేహ మొక్కటి చాలు
నిలువున కూల్చుటకు
నీవు స్నేహమొనర్చినవారికి
విధి యేల శత్రువు కావలె.

*                *

126. నా మనసు నామెకర్పించినాను
విచారమేల హృదయ మిచ్చినపుడు
ఇక మాటాడుట ఎందుకు ?

*                *

ఆమె ఆత్మాభిమానం మారదు
నేనేల మారవలయును ?
నాపై అలుక బూనినపుడు
నోరు నొవ్వగ నడుగనేల ?

• •

127. నేను లేనపుడిక
విలాసిను లలంకరించుకొననేల ?
ఎదను దోచుకొన్న వారిపుడు
ప్రశాంతముగ నుండవచ్చు !

• •

128. నేను లేనినాడు ప్రణయ పీఠ
మలంకరింప అర్హులెవరు ?
విలాసాలు - ఒయ్యారాలు
అన్నీ వ్యర్థములు !!

• •

దీపమారిన కొడిగట్టును
నల్లని ధూమము చెలరేగును
నే నంతరించుటతో
అందరును నల్లటిముసుగు వేసినట్లున్నది.

• •

నేను లేని అవస్థలో—
హై పెక్కు మద్యము త్రాగేవారెవ్వరని
సాకి పిలిచి పిలిచి అడుగును !
తిరిగి తిరిగి గోష్ఠిలో అడుగును !

• •

ప్రణయపు నిరాశ్రయ దీనస్థితి చూచిన
నాకే ఏడ్పు వచ్చుచున్నది
దానిని భరించేదెవరని ఇక !?

• •

ఇపుడా వియోగబాధ ఆ సంయోగ పారవశ్యం
ఆలనాటి దినములు
రాత్రింబవళ్ళు - ఇక లేవు.

• •

129. ప్రణయ వ్యవహారాలకు తపించే దేవరిక
అందానికి ముగ్ధులయ్యే స్థితి ఎవరికున్నది ?

• •

130. ఆ హృదయమే లేదిక
అప్పటి మనసే లేదిక
ప్రణయరూపము దివ్యరేఖల
ఛాయలింకేవియును లేవు.

• •

సుకుమార ప్రణయ పారవశ్యపు
మూర్తియే లేదిక -
హృదయోల్లాసము వాటితోనే
హరించినది.

• •

131. నీ ముఖబింబము విరియని గులాబి మొగ్గతో
సుదూరము నిల్చొని ఏల చూచెదవు
నా కొక చుంబనమిమ్ము
ఆ విషయమే తెల్పుటకు.

• •

ఆమె గోష్ఠిలో కూర్చున్నది - నోరు విప్పదు
నేనుకూడ మూగనైతిని
ఇది ఇట్లని తెల్పుటకు
సభా మర్యాదను కాపాడాలని.

• •

ప్రాణములెట్లు పోవునని ఆమె అడిగినపుడు
కలవరమందితి నేను
మందమారుతము వీచినది
ఆ మర్మమునే తెలుపుటకు.

* *

132. జీవరేఖలున్నపుడు భాగ్యమున కేమి కొరత
మధు చషకము లభించినపుడు
హస్త రేఖలన్నియు జీవరేఖలె యగు.

* *

సాకీ వహించేది మద్యపు సీసా కాదు.
మైకాన్నే
ఆమెను చూసిన చాలు
మద్యపాన మొనర్చినట్లే.

* *

133. దివ్యమైన పరతత్త్వమును
వివరించునపుడు
మద్య చషకముల ప్రసక్తి తప్పదు.

* *

134. నేను ! పానశాలవెళ్ళి త్రాగక మరలిరావటమా ?
త్రాగనని శపథమొనర్చిన మాత్రాన
చషక మొసగు ధర్మమును
సాకి ఏల మఱచె.

* *

135. నిరాశాస్థితిని సరిగా వివరించలేను
తీరపు స్థితిని తరంగములు తెల్పును.

* *

136. మారుతము హృదయాహ్లాదకరముగ
వీచుచున్నది-
త్రాగినట్లే మైకము
క్రమ్ముచున్నది.

*                    *

137. ప్రణయ మద్యమొసగి పరీక్షించు
అర్హులెవరో స్పష్టమగును
ప్రేమించుటకును తగిన శక్తివలయును.

*                    *

138. మద్యపాన మొనర్చుశక్తి ఒక్కొక్కరిలో భిన్నము
నిషాస్థాయిని చూచి పానశక్తిని గ్రహింపవచ్చు
సాకీ! నీవు మద్య సముద్రమైన
నేను మత్తిలిన తీరాన్ని.

*                    *

పెదవులారినవి - నిస్సహాయ స్థితి -
నన్ను జూచుట కెందరో వచ్చుచున్నారు
దుఃఖము మూర్తీభవించినవాడ నేను.

*                    *

పగిలిన అద్దమును చేబూనినాను
నఖశిఖపర్యంతము మనసు విరిగిన మూర్తిని
వేదన నొందే హృదయమును.

*                    *

అనుక్షణము మోసపోయి
బాధనొందిన హృదయమును
నిరాశ మూర్తీభవించినవాడ నేను.

*                    *

అసదూ! పైకిచూచిన ఏమియు లేనట్లుండును
లోనమాత్రము దుఃఖపూర్ణము
వాడి పడియున్న పూలుచిలికే
బాధనొందిన చిరునవ్వు నాది.

*     *

139. హస్తబంధనాల త్రుంచి
వేయాలని తోచును - కాని
నా 'పిచ్చి' వార్త లోకానికి
క్షణములో వ్యాపించునని భయము-

*     *

జ్ఞాని అగుటకంటె
అమాయకుడగుట మేలు
జ్ఞానము క్షణకాలము నిలువనీయదు.

*     *

140. అన్నిటికి విధియే మూలమని
అందరును భావింతురు
ఈ స్వార్థమునకు నా మనసు చలింపకుండుగాక.
ఈ గుండెను అశక్తముగ నుండనీయను
విట్టూర్పుల నీ జీవితము ప్రతిబింబము కావలయును
ఓ పరమాత్మా! జ్ఞానమువలన
కలుగు బాధకు నేను ప్రతీకమూర్తిని
నా ఊహాప్రపంచము స్వప్నప్రపంచము కావలె
దాని తీరాన నిల్చొని చకితుడ నౌదు.

*     *

ఏమియు లేకపోవుటయు మంచిదే
అందరును కొంత ఇచ్చుచుందురు

నగ్నముగా తిరిగేవారికి
వస్త్రములెన్నియో సమకూరును.

*  *

జ్ఞాని యగుటకంటె
అమాయకపు చూపు మంచిది
చూచుట - ఆశ్చర్యపడుట
అది యొక వింత.

*  *

ఉన్మత్త స్థితి వ్యర్థం
విరిగిన రెక్క ఎగురనీయవు
సుఖము నాసించు మావంటివారికి
ఇవి అసాధ్యం.

*  *

వారు అందమైన జింకలు
అకు సందడితో అతిదూరము పారిపోవును
ప్రేమకాని మరేదియుగాని
వీరిని వశీకరింపజాలదు.

*  *

ఎగురుట కుత్సహించు పక్షిని నేను
ఈ ప్రపంచము చిన్న గూడువంటిది.
ఉత్సాహము హృదయపంజరములో తటపటలాడుచు
స్వేచ్ఛావాయువు కోరును.

*  *

141. మెత్తనివానిని ప్రపంచము కఠినాత్ముని చేయును
ఉన్మత్తస్థితి బాధాకరము
విచారములో క్రుంగిపోయినది.

*  *

నేను కోరికల ఉద్యానవనమును
సౌందర్యదృష్టిని పూవులవలె దోచుకొనెడివాడను
గొంతులో వేలకొలది రాగములు దాగియున్నవి
మౌనమూనిన కోకిలను నేను.

•  •

142. బంధనముల గొలుసు బాధించును
అందు సంగీత ధ్వని వెలువడును
బాధలోని మాధురినిట్లే అనుభవించు.

•  •

143. అందలేదు వలపు పంట
ఆశాభంగము తప్ప
హృదయముల కలయిక
పెదవుల కుట్టివేసినట్లే-

•  •

నడచుచున్న పొక్కులు వచ్చును
గుండె ప్రాణమునకు వచ్చినదనుకొ
నిర్భయస్థితి వచ్చినపుడు
ఇంకేదియు భయపెట్టజాలదు.

•  *

144. నిరీక్షణ ప్రాణాంతకము-
అది ఒక పురువువంటిది-
ఎదురుచూచిన స్థితిలో-సాన్నిధ్యములో ఒకే అవస్థ
కాలటము-
అసదు నొసట వ్రాసియున్నది
కీర్తిజ్యోతికి ఆసవులర్పించే కీటకము కావాలని.

•  •

145. వారి చూపే వారికీ స్థితి కలిగించినది
నగరములోనున్న నేమి? ఎడారిలోనున్న నేమి?
ఎటు వెళ్ళినను ఎడారివంటి ఎద
వారి వెంబడి యుండును.

*

146. నిశ్చల హృదయస్థితికి సులభమార్గము
నిన్ను నీవు ఆతని ఆలోచనలో మగ్నం
చేసికొనుము.
రెండు లోకముల జ్ఞానము పొందుట
నిద్దురలేక బాధపడుటకంటె
పై మార్గము మంచిది.

* *

147. నా కన్నులలో వేలకొలది పాదముల ముద్రలు
ప్రపంచము - ఆనంద ధనరాసుల పూర్ణం-
ఇహపరలోకాలను చూసితిని
ఒక నవ్వుతో తిరస్కరింపబాలినవి అవి.

• •

148. సామాన్య వస్తువుల గిరాకీ తగ్గినట్లు - భగ్నమైన
విలువ, గుండె విలువ తగ్గినంతనె
తెరచాటున చేరు నవ్వు-

• •

149. జీవన మను చెరసాలలో
విముక్తిలేదు - శిక్ష ననుభవించక తప్పదు
నిప్పురవ్వ రాతి నరాలలో దాగియున్న —, రాలేదు-
వచ్చినదా ! అది బ్రతికియుండలేదు-

• •

150. నా జీవితములో సాధించినదేదా
పశ్చాత్తాపమున తల్లడిల్లును.
నా స్థితి ప్రొద్దుటి దీపమువంటిది-
సిగ్గుతో కరిగిపోవును - కొడిగట్టును - పొగచూరును.

• •

పానమొనర్ప దలచనివారికి
ఎదుట నది ప్రవహించినను
అది ఎడారివంటిది - ఏమి లాభం ?

• •

151. ఇల్లు కట్టాలను కోరిక తప్ప
ఇంటిలో మట్టిపెల్ల లేదు
ప్రణయము నన్ను కొల్లగొట్టినది
సిగ్గుతో తల వంచుకొంటిని.

• •

152. కొంపకూలుట చూచి విలపించుచుంటిని
మాటిమాటికి-
ఇంటి గోడలు - తలుపు లన్నియు
ఆ సూచనలనే చిలుకుచున్నవి-

• •

153. ఈ సృష్టిలోనే లయము గర్భితము
చెమటలోడ్చి పండించిన ధాన్యరాసుల జూచి
పిడుగుపాటు వైఖరిని గమనింపవచ్చు.

• •

154. విశ్వమంతయు పాడుపడిన స్థితిలో నున్నది
ఎవారి. ఇంటినే తలపించుచున్నది.

• •

155. ఎవరో ఆర్పిన దీపమును నేను
దానికి సభలో సార్థకత ఏమి ?
తీరని కాంక్ష ఎదలో చిచ్చును కలిగించినది.

• •

156. ప్రేయసీ విరహము - కోరిక లేదు
స్మృతికూడ అంతరించినది.
అగ్నికి ఆహుతియైన
ఇల్లువంటివాడ నేను.

• •

157. తీరని కాంక్ష తీవ్రమైన
ఆఘాతమును కలిగించినది.
ప్రియునిచూచు కోరికయే శత్రువైనది.

బాజారులో గోష్ఠిలో ఈర్ష్య తప్పదు.
అక్కడ చేరినవారిని చూచిన
నే నామెను చూచిన - నాకు నాపై ఈర్ష్య.

* *

158. ఈ లోక మతని సృష్టి
తనను తాను అందులో వ్యక్తము
ప్రతిసౌందర్యము తన్ను తా జూచి
ఆనందించుచున్నది.

* *

జీవన మృత్యువుల స్వరాలు
ఉదాత్తానుదాత్తాలు
నా జీవిత మొక స్వరపూర్ణం.

* *

విజ్ఞానగర్వం - మూర్ఖం
ఈ ప్రార్థనలు - ఉపవాసములు వ్యర్థం.
ఈ లోకమైనను ఆ లోకమైనను
పానపాత్ర అడుగున పేరిన మద్దివంటిది.

# కొన్ని ఆధార గ్రంథములు

## ఆంగ్ల గ్రంథములు


1. కౌల్–జే. ఎల్–ఇంటర్‌ప్రెటేషన్ ఆఫ్ గాలిబ్ – అత్మారామ్ అండ్ సన్స్ – ఢిల్లీ 1957.
2. లతీఫ్ – డా. సయ్యద్ అబ్దుల్ – గాలిబ్ – ఏ క్రిటికల్ అప్రీసియేషన్ ఆఫ్ హిస్ లైఫ్ అండ్ ఉర్దు పొయిట్రీ – హైద్రాబాదు–1929.
3. ముజీబ్ – ఎం – ది ఇండియన్ ముస్లిమ్సు – జార్జి అలెన్ అండ్ ఉన్విన్ – లండన్ – 1967.
4. ఖాదిర్ – అబ్దుల్ – ఫేమస్ ఉర్దూ పొయెట్స్ అండ్ రైటర్స్ – న్యూబుక్ సొసైటీ – మొదటి ప్రచురణ – 1947.
5. సాదిఖ్ – మహమ్మద్ – ఎ హిస్టరీ ఆఫ్ ఉర్దూ లిటరేచర్ – ఆక్సు ఫర్డు యూనివర్శిటీ ప్రెస్ – లండన్–1964.
6. సక్సేనా – రాంబాబు – ఎ హిస్టరీ ఆఫ్ ఉర్దూ లిటరేచర్ – రాంనారాయన్‌లాల్ – అలహాబాదు–1927.
7. సూఫియాసాదుల్లా – సెలెక్టడ్ వర్సెస్ ఆఫ్ మిర్జా గాలిబ్ – డార్వెన్ ఫిన్లేసన్ – లండన్–1965.


## ఉర్దూ గ్రంథములు


1. అర్షీ – మౌలానా ఇమ్తియాజ్ అలీ – మకాతిబె గాలిబ్ – అంజుమన్ తరఖ్ఖి ఉర్దూ – అలీగఢ్–1937.

2. ఆర్షు - డా. ముఖ్తారుద్దీన్ :

(a) అహవాలె గాలిబ్ - (వ్యాస సంపుటి) అంజుమన్ తరక్షీ ఉర్దూ - అలీగఢ్-1956.

(b) నక్షెగాలిబ్ - (వ్యాస సంపుటి) అంజుమన్ తరక్షీ ఉర్దూ అలీగఢ్-1956.

3. అసర్ - మిర్జా మహమ్మదు - అదబీ - ఖుతూతెకలామెగాలిబు - దేనిష్మహల్ - లక్నో-

4. అస్కరీ - మిర్జా మహమ్మదు - అదబీ ఖుతూతె గాలిబ్ - ఇదారె ఫరోగె ఉర్దూ - లక్నో-1964.

5. అఫాఖ్ - అఫాఖ్ హుస్సేన్ - నాదిరాతె గాలిబు - ఇదారెనాదిరాత్ కరాచి - 1949.

6. ఆసి - మౌలానా అబ్దుల్ బారి - మిర్జా గాలిబ్ కే ఖూతూ మక్తబె దీన్వ దునియా - లక్నో-1965.

7. ఆజాద్ - మౌలానా మహమ్మదు హుస్సేన్ - ఆబెహయాత్ - లాహోరు - 12 వ ప్రచురణ.

8. బిజ్నోరీ - డా. అబ్దుల్ రహమాన్ - మహాసిన్ కలామె గాలిబ్ అంజుమన్ తరక్షీ ఉర్దూ అలీగఢ్-1952.

9. గాలిబు - అసదుల్లాఖాన్—

(a) కుల్లియాతె గాలిబు - (ఫార్సీ) మత్బయె - నవల్కిశోర్ - లక్నో.

(b) దీవాన్ గాలిబు - (ఉర్దూ) సంపాదకుడు - పరిష్కర్త - మౌలానా ఇమ్తియాజ్ అలీఖాన్ అర్షీ.

(c) ఊదె - హిందీ - (లేఖలు) మత్బయె నవల్ కిశోర్ - కాన్పూరు-1913.

(d) ఉర్దూయెమౌల్లా (లేఖలు) ముఫీదెఆమ్ ప్రెస్ ఆగ్రా-1914

10. హాలీ - మౌలానా అల్తాఫ్ హుస్సేన్. యాదగారె గాలిబ్.

సామి ప్రెస్ - కాన్పూరు-1897.

మజ్లిసె తరఖ్ఖి అదబ్ లాహోరు-1963.

11. ఇక్రామ్ - షేక్ మహమ్మదు—

(a) అసరె గాలిబు.

(b) హయాతె గాలిబు - ఫిరోజుసన్సు - లాహోరు - 1936.

(c) గాలిబ్ నామా.

12. ఖలీఫా అబ్దుల్ హకీమ్ - అఫ్కారె గాలిబు - మక్తబె మొయినుల్ అదబ్ - లాహోరు-1954.

13. డా. ఖుర్షీదుల్ ఇస్లామ్ - గాలిబ్ - అంజుమన్ తరఖ్ఖీ ఉర్దూ ఆలీగఢ్-1960.

14. లతీఫ్ - డా. సయ్యద్ అబ్దుల్ - గాలిబు.

15. మహేష్ ప్రసాద్ - ఖుతూతె గాలిబ్ - హిందుస్తానీ అకాడమీ అలహాబాదు.

16. మాలిక్ రామ్—

(a) జికరె గాలిబ్ - నాలుగవ పరిష్కృత ముద్రణము మక్తబెజామె - న్యూఢిల్లీ-1964.

(b) తలయిజమెగాలిబు - మర్కజ్ తస్నీఫ్వతాలీఫ్ - నికోదర్-1957.

17. మెహర్ - మౌలానాగులామ్‌రసూల్ - గాలిబు - ముస్లిమ్ ప్రింటింగ్ ప్రెస్ - లాహోరు - మొదటి ప్రచురణ - 1936.

18. అయినయె గాలిబ్ (వ్యాసముల సంపుటి) పబ్లికేషన్ డివిజన్ - గవర్నమెంటు ఆఫ్ ఇండియా - న్యూఢిల్లీ - 1964.

19. రిజ్వీ - ప్రొ. సయ్యద్ మసూద్ హుస్సేన్ అదీబు - ముతఫర్రిఖాతె గాలిబ్ (అముద్రిత లేఖలు - పద్యముల సంకలనము) హిందుస్తానీ ప్రెస్సు - రాంపూర్ -

20. సబ్జవారీ - సయ్యద్ షౌకతు - గాలిబు - ఫికరోఫన్ అంజుమన్ తరక్కీ ఉర్దు - కరాచీ - 1961.

21. సందిల్వి - వజాహత్ హుస్సేన్—

(a) ఖాభియాతె గాలిబు - నసీమ్ బుక్ డిపో - లక్నో-1960.

(b) నిషాతె గాలిబు - ఇదారెఫరోగె ఉర్దూ - లక్నో-1964.

22. జోర్ - డా. సయ్యద్ మొహియుద్దీన్ ఖాద్రీ—

(a) రూహె గాలిబ్ - ఇదారె అదబియాతె ఉర్దూ - హైదరాబాదు - 1939.

(b) సర్గుజిష్తె గాలిబ్ - 1939.

117663
20/12/04

ఉర్దూ కవులలో ప్రముఖుడుగా ప్రశస్తి వహించినవాడు గాలిబు కవి. భారతదేశమునందును విదేశములందును వసించు ఉర్దూ మాతృ భాషగ లేని వారు ఈ కవి కృతులనుగూర్చి తెలిసికొనుట అవసరము.

గాలిబు కవి నిర్దిష్టమైన కవితా సంప్రదాయము ననుసరించెను. దాని నాతడు తన అనుభవములతోడను, ఊహ, కల్పనాశక్తితోడను, పరిపుష్టమొనర్చెను. మొదటి దశలో అతని వ్యక్తీకరణ విధానము శక్తిమంతమైనను, ఉర్దూ పారశీక నుడికారమును నిర్లక్ష్యమొనర్చెను. అప్పుడాతడు పారశీకమున రచనలొనర్చుట కారంభించి, అనంతర దశలో ఉర్దూ భాషను మరల చేపట్టెను. తరువాతి దశలోని అతని రచనలు బహుళప్రాచుర్యము నొందినవి. హృదయగతమైన గంభీర భావములను పరమోత్కృష్టరీతిలో హృద్యముగ నాతడు వ్యక్తీకరించెనని తరువాతి తరములవారు గ్రహించిరి. ఆచార్య ముజీబు చారిత్రకులు కనుక గాలిబు యుగమును అత డనుసరించిన కవితా సంప్రదాయమును స్పష్టముగా చిత్రింపగలిగిరి.

అనువాదమునందును వీరు అనుభజ్ఞులు. క్రీ.శ. 1930 నాటికే వీరు రష్యన్ అనువాదముల నాధారముగ గొని ఉర్దూలో రష్యన్ సాహిత్య చరిత్ర రచించిరి. ముజీబుగారు "భారతీయ మహమ్మదీయులు" అను గ్రంథమునందు గాలిబుతోపాటు ఇతర ఉర్దూ కవుల కృతలనుండి కొన్ని భాగముల ననువదించి ఉదాహరించిరి.

Ghalib (Telugu

IIAS, Shimla
Library
TL 819.150 92 G 341 M
00117663